



◆ నిండు కుండలా శ్రీశైలం జలాశయం

బిర బిరా కృష్ణమ్మ

◆ రెండు రోజుల్లో నిండనున్న శ్రీశైలం
◆ సాగర్‌కు 77,771 క్యూసెక్కుల ప్రవాహం
◆ నేడు శ్రీశైలం జలాశయం గేట్లు ఎత్తేందుకు ఆదేశాలు ◆ సాగర్ ఆయకట్టులో పూర్తిగా మారిన సాగు చిత్రం
◆ ప్రత్యామ్నాయ సాగును తాత్కాలికంగా నిలిపిన రైతులు ◆ వరి సాగు దిశగా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్న అన్నదాతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వస్తోంది. దీంతో జలకళ సంతరించుకుంది. నాగార్జున సాగర్ జలాశయం దిశగా కృష్ణమ్మ పరవళ్లు తొక్కు తోంది. సాగర్ డ్యాంకు కూడా రోజురోజుకు వరద పెరుగుతోంది. శ్రీశైలం జలాశయంలోకి ఆదివారం 4,41,222 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలంలో 215.81 టీఎంసీలకు 155.78 టీఎంసీలకు చేరింది. శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ సాగర్‌కు 77,771 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలశయానికి ఇదే స్థాయిలో వరద మూడు రోజులు కొనసాగుతుందని జల వనరుల శాఖ అంచనా వేస్తోంది. ఈ క్రమంలో సోమవారం శ్రీశైలం గేట్లు ఎత్తి సాగర్‌కు నీటిని విడుదలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. శ్రీశైలానికి వరద పోటెత్తుతుం డటంతో సాగర్ ఆయకట్టులో సాగు చిత్రం రెండు రోజుల్లోనే మారిపో యింది. వరి సాగుపై అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. శ్రీశైలం నిండి సాగర్‌కు నీరు వస్తుందన్న అంచనాతో ప్రత్యామ్నాయ పంటల సాగును తాత్కాలికంగా నిలిపి వేశారు. సాగు నీరు వస్తుంది వరి సాగు చేసే అవకాశాలు ఉన్నాయని రైతులు అభిప్రాయ పడుతున్నారు. ఈ దిశగా సాగు ప్రణాళికను మార్చుకుని వరి సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

శ్రీశైలానికి 173 టీఎంసీల నీరు రాక

ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర జలాశయాల నుంచి దిగువకు దాదాపు నాలుగు లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలంలో నీటి మట్టం అంతకంతకు పెరుగుతోంది. ఐదు రోజుల్లో శ్రీశైలానికి 123.27 టీఎంసీల నీరు వచ్చింది. సాగర్‌లో కూడా నీటి నిల్వ ఆశాజనకంగా పెరుగుతోంది. శ్రీశైలం ఎగువ ప్రాజెక్టుల నుంచి విడుదల చేస్తున్న వరద నీటిని లెక్కిస్తే శ్రీశైలానికి దాదాపు ఇంకా 173 టీఎంసీల నీరు వస్తుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. ఈ లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే సాగర్‌కు దాదాపు 125 టీఎంసీల వరకు నీరు వచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తాగు నీటి అవసరాలకు కుడి కాల్వకు సాగర్ నుంచి 8,212 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వరద వివరాలపై రైతుల ఆసక్తి

ఆల్మట్టి నుంచి నీరు ఎంత విడుదల చేస్తున్నారు.. శ్రీశైలం ఎప్పుడు నిండుతుంది.. ఏ జలాశయానికి ఎంత వరద వస్తుంది.. ఇలా సాగర్ కుడి కాలువ ఆయకట్టు రైతులు ఎప్పటికప్పుడు వరద వివరాలు తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. మీడియా, అంతర్జాలం ద్వారా ఆయా వివరా లను గమనిస్తున్నారు. ఏ ఇద్దరు రైతులు కలిసినా జలాశయాలకు వస్తున్న వరద నీటిపై లెక్కలు వేసుకుంటున్నారు. కృష్ణానది బేసిన్‌లో నమోదవుతున్న వర్షపాతం వివరాలను అన్నదాతలు ఆసక్తిగా గమనిస్తున్నారు. సాగర్‌కు ఎంత నీరు వచ్చే అవకాశం ఉందన్న అంశాన్ని కూడా వారు టీఎంసీలలో లెక్కలు కడుతున్నారు. సాగర్‌కు వరద నీరు వస్తుండటంతో అన్నదాతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది సాగు నీరు లేక లక్షలాది ఎకరాలు బీళ్లుగా మారిన నేపథ్యంలో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ఈ ఏడాదైనా సాగు నీరు వస్తుందని ఆశపడుతున్నారు. కృష్ణమ్మ పర వళ్లు కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు.

జలాశయాల్లో నీటి నిల్వల వివరాలు...

జలాశయం	పూర్తి స్థాయి నీటి నిల్వ టీఎంసీలలో	ప్రస్తుత నిల్వ టీఎంసీలలో	వస్తున్న వరద నీరు క్యూసెక్కుల్లో	విడుదల చేస్తున్న నీరు క్యూసెక్కుల్లో
ఆల్మట్టి	123.08	76.69	2,18,230	2,96,794
నారాయణపూర్	33.31	25.65	2,90,042	3,03,925
జూరాల	9.66	7.63	2,99,432	2,88,424
తుంగభద్ర	105.78	100.52	1,03,676	1,17,691
శ్రీశైలం	215.81	155.78	4,41,222	80,711
నాగార్జున సాగర్	312.05	132.98	53,677	6,344
పులిచింతల	45.77	1.06	50	50



సంఘటన స్థలంలో బోల్తా పడిన ట్రాక్టర్, చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు

మొక్కుబడికి వెళ్తుండగా.. ఘోరం

● ముగ్గురు మృతి.. 11 మందికి తీవ్రగాయాలు
● దమ్మనవారిపాలెం వద్ద ట్రాక్టర్ ట్రక్కు బోల్తా
● గుట్టువారిపాలెంలో విషాదం

బాపట్ల, రేపల్లె, జూలై 28: మొక్కు తీర్చుకోవాలని బంధువులందరూ కలిసి ట్రాక్టర్‌లో బయల్దేరారు. అయితే ఇరుకు రోడ్డులో ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి ట్రాక్టర్ బోల్తా పడటంతో ఘోరం జరిగింది. దైవ దర్శనానికి వెళ్లే ఆనందంలో ఉన్న ముగ్గురు మృతి చెందగా 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం వద్ద జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు.. నగరం మండలం గట్టువారిపాలెం గ్రామానికి చెందిన గట్టు వెంకటేశ్వరమ్మ కొండపాటూరు పోలేరమ్మతల్లికి మొక్కుకుంది. ఈ క్రమంలో ఆమె మొక్కు తీర్చుకునేందుకు ఆదివారం కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు 20 మందితో కలిసి ట్రాక్టర్‌లో కాకుమాను మండలం కొండపాటూరు పోలేరమ్మతల్లి గుడికి బయలుదేరారు. వీరి ట్రాక్టర్ కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం గ్రామ శివారు వచ్చే సరికి బాపట్ల నుంచి రేపల్లె వెళ్తున్న బస్సు ఎదురైంది. ఆ బస్సును తప్పించేందుకు ట్రాక్టర్ డ్రైవర్ రోడ్డు దిగువనకు వెళ్లాడు. దీంతో ట్రాక్టర్ ట్రక్కుతో సహా బోల్తా కొడుతూ ఐదారడుగుల లోతులో ఉన్న పొలాల్లో పడిపోయింది. ట్రక్కులో ఉన్న గట్టు కోటేశ్వరరావు(65), గడ్డం శివనాగులు(60), గడ్డం లక్ష్మి(40) అక్కడికక్కడే మృతి చెందారు. పాలెం శేషమ్మ, ఇమ్మడిశెట్టి నాగలక్ష్మి, పాలెం పుష్పావతి, కాట్రగడ్డ లక్ష్మి, మక్కె రమాదేవి, పాలెం కృష్ణకుమారి, పాలెం సీతామహలక్ష్మి, పాలెం శివకుమారి, ఇమ్మడిశెట్టి రాఘవమ్మ, పాలెం సుబ్బరావమ్మ, కాట్రగడ్డ సుజాత తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పార్టీశ్రేణులతో కలిసి హుటాహుటీన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గలకారణాలను డీఎస్పీ సి.హెచ్.మురళీకృష్ణ, సీఐలు శ్రీహరి, హజరత్‌బాబులను అడిగి తెలుసుకున్నారు. స్థానికుల సాయంతో ట్రాక్టర్ కిందపడి దుర్మరణం చెందినవారిని బయటకు తీయించారు. క్షతగాత్రులను ఏరియా వైద్యశాలకు తరలించారు. పుష్పావతి, కృష్ణకుమారి, రమాదేవి, లక్ష్మిలను మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ఆస్పత్రికి, నాగలక్ష్మిని తెనాలి వైద్యశాలకు తరలించారు. మృతి చెందిన కోటేశ్వరరావుకు భార్య, కుమారుడు, కుమార్తె, శివనాగులుకు ఇద్దరు అమ్మాయిలు, ఒక కుమారుడు, లక్ష్మికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాద సమాచారం తెలియడంతో మృతుల బంధువులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో బాపట్ల ఏరియా వైద్యశాల వద్దకు తరలివచ్చారు. దైవదర్శనానికి వెళ్లేందుకు ఉదయం అందరూ ఉత్సాహంగా వెళ్తుండగా గ్రామస్తులు వీడ్కోలు పలికారు. కొద్దిసేపటికే ముగ్గురు మృతి చెందారని, 11 మంది తీవ్రంగా గాయపడ్డారని తెలియడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.



మృతులు గట్టు కోటేశ్వరరావు, లక్ష్మీ, శివనాగులు

చికిత్స, ఆర్థిక సాయంపై మంత్రి అనగాని ఆదేశాలు

ట్రాక్టర్ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందించారు. బాపట్ల ప్రభుత్వ వైద్యశాలకు ఫోన్ చేసి బాధితులకు తక్షణమే మెరుగైన వైద్యసేవలు అందించాలని, అవసరమైతే గుంటూరు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటమురళికి సూచించారు. దీంతో జేసీ సుబ్బారావు ఆస్పత్రి వద్దకు వచ్చి ఘటన వివరాలు, బాధితులకు కావాల్సిన వైద్య సహాయంపై వైద్యులతో చర్చించారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఘటన బాధాకరమని మంత్రి అనగాని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.25 వేలు చొప్పున, గాయపడినవారికి రూ.5 వేలు చొప్పున ఆర్థికసాయాన్ని మంత్రి సోదరుడు శివప్రసాద్ అందజేశారు.

మళ్లీ.. మినీ గోకులాలు



గోకులం పథకం కింద నాడు నిర్మించిన షెడ్

షెడ్ల మంజూరు జిల్లాల వారీగా

జిల్లా	మంజూరైన షెడ్లు
పల్నాడు	700
గుంటూరు	450
బాపట్ల	625

● పశు పోషకులకు ప్రభుత్వ చేయూత ● గతంలోలా షెడ్ల నిర్మాణానికి పచ్చజెండా ● ఉమ్మడి గుంటూరు జిల్లాకు 1,775 షెడ్ల నిర్మాణం ● రాయితీలతో మండలానికి 25 యూనిట్లు మంజూరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పాడి పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. గేదెలు, జీవాలు, కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించింది. వాటి పెంపకంలో ప్రధాన ప్రతిబంధకంగా ఉండే షెడ్ల నిర్మాణానికి ప్రత్యేకంగా గతంలోనే టీడీపీ ప్రభుత్వం మినీ గోకులాల పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ మినీ గోకులాల పథకాన్ని ప్రవేశపెట్టింది. గతంలోలా మినీ గోకులం నిర్మాణాలకు పచ్చజెండా ఊపింది. షెడ్ల నిర్మాణంలో పశు పోషకులకు 90 శాతం, జీవాలు, కోళ్ల పెంపకందారులకు 70 శాతం మేర రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి మార్గదర్శకాలు జారీ చేశారు. పశు సంవర్ధక శాఖ అధ్వర్యంలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిధులు విడుదల చేయనున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు 1,775 షెడ్లను మంజూరు చేశారు. 2018లో టీడీపీ హయాంలో తొలుత మినీ గోకులం పథకాన్ని ప్రారంభించారు. అప్పట్లో విస్తృతంగా మినీ గోకులాలను నిర్మించారు. ఇదే తరహాలో మళ్లీ గోకులం పథకాన్ని చంద్రబాబు ప్రవేశపెట్టారు. పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకల పెంపకందారులకు ఆర్థికంగా చేయూత అందించే క్రమంలో ఈ పథకాన్ని ప్రభుత్వం మళ్లీ ప్రవేశపెట్టింది. పశువుల షెడ్లకు లబ్ధిదారుడు 10 శాతం చెల్లిస్తే 90 శాతం ప్రభుత్వం నిధులు ఇస్తుంది. కోళ్లు, గొర్రెలు, మేకలు పెంపకందారులు వారి వాటా ధనం మొత్తం వ్యయంలో 30 శాతం చెల్లిస్తే 70 శాతం ప్రభుత్వం ఇస్తుంది. తొలి విడతలో మండలానికి 25 యూనిట్లు ఇవ్వాలని నిర్ణయించారు. సొంత స్థలం ఉన్న చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ పోషకులకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

నాటి బిల్లులు చెల్లించలేదు

మినీ గోకులం పథకం కింద టీడీపీ హయాంలో రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ఈ బిల్లులను పక్కన పెట్టేశారు. అయితే తాజాగా మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో ఇప్పటికైనా మోక్షం కలుగుతుందని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. నాలుగు పశువులు ఉంటే రూ.1.5 లక్షలు, ఆరు పశువులకు రూ.1.8 లక్షలు చొప్పున నిధులు కేటాయించింది. రైతులు అప్పట్లో పనులు ప్రారంభించి నిర్మాణాలు పూర్తి చేశారు. ఇంతలో ఎన్నికలు జరగడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో మినీ గోకులం బిల్లులు మంజూరు చేయలేదు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో దాదాపు రూ.106 కోట్లు బిల్లుల బకాయిలు ఉన్నట్లు పశు సంవర్ధకశాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. నిర్మాణాల బిల్లులు చెల్లించాలని పోషకులు పలుమార్లు ఆందోళనలు చేపట్టినా వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. అయితే కూటమి ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించి న్యాయం చేస్తుందని రైతులు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు.

పశువుల గోకులం వివరాలు (రూ.లక్షల్లో)

షెడ్డు పరిధి	వ్యయం	రాయితీ	లబ్ధిదారు వాటా
2 పశువులు	1,15,000	1,03,500	11,500
4 ఉంటే	1,85,000	1,66,500	18,500
6 మించి	230,000	2,07,500	23,000

గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్ల వివరాలు (రూ.లక్షల్లో)

షెడ్డు పరిధి	వ్యయం	రాయితీ	లబ్ధిదారు వాటా
20 గొర్రెలు, మేకలు	1,31,000	91,000	39,000
50 దాటితే	2,30,000	1,61,000	69,000
100 కోళ్లు ఉంటే	87,000	60,900	26,100
200 పైగా ఉంటే	1,32,000	92,000	39,600

> పాడి, జీవాలు, కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు.., వాటి పోషకులకు చేయూత ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చింది. గతంలో టీడీపీ ప్రభుత్వంలో మినీ గోకులాలను ఏర్పాటు చేసి పోషకులను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్స హించారు. ఎక్కడి కక్కడ పాడి పశువులు, జీవాలు, కోళ్ల కోసం షెడ్లను నిర్మించేలా మినీ గోకులాలను మంజూరు చేశారు. అయితే 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం మినీ గోకులాలను విస్మరించింది. దీంతో పోషకు లకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. అయితే మళ్లీ చంద్ర బాబు ముఖ్యమంత్రి కావడంతో మినీ గోకులాల పథకాన్ని ప్రవేశ పెట్టి, షెడ్ల నిర్మాణానికి లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు ప్రభు త్వం సిద్ధమైంది. జాతీయ ఉపాధి హామీ పథకం కింద మినీ గోకులాలకు నిధులు విడుదల చేసేలా ప్రభుత్వం విధివిధానాలను ఖరారు చేసింది.

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

● ఎమ్మెల్యేల సిఫార్సుల మేరకే..

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల కోసం జోన్-3లో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో విధుల నిర్వహణ కోసం వెళ్లిన తహసీల్దార్లు వెనక్కు రాగా వారికి కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి వేర్వేరు మండలాల్లో పోస్టింగ్‌లు కల్పించారు. అయితే ఈ పోస్టింగ్‌ల్లో ఎక్కువ శాతం స్థానిక ఎమ్మెల్యేల సిఫార్సుల ఆధారంగానే జరిగాయన్న ఆరోపణలు వస్తున్నాయి. శనివారం రాత్రికే తహసీల్దార్ల పోస్టింగ్‌ల ఆర్డర్ అయినప్పటికీ వాటిని ఆదివారం ఉదయం విడుదల చేశారు. ఐదు మండలాలను ఖాళీగా పెట్టి వాటికి డిప్యూటీ తహసీల్దార్లను ఇన్‌చార్జిలుగా పూర్తి అదనపు బాధ్యలు కేటాయించారు. పెద్దగా సిఫార్సులు తెచ్చుకోలేని వారికి కలెక్టరేట్, ఆర్‌డీవో కార్యాలయాల్లో పోస్టింగ్‌లు లభించాయని రెవెన్యూవర్గాలు చర్చించుకుంటున్నాయి. తహసీల్దార్ల పోస్టింగ్‌ల కోసం తెరవెనక సిఫార్సులు పెద్దఎత్తున జరిగాయని తెలిసింది. అమరావతి రాజధాని వెలుపల ఉన్న తాడికొండలో పోస్టింగ్ హాట్ కేక్‌లా మారింది. ప్రస్తుతం రాజధానిలో కంటే ఈ మండలంలోనే భూముల క్రయవిక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ దృష్ట్యా ఈ మండలంపై ఏకంగా 11 మంది తహసీల్దార్లు కన్నేసి ఎవరి ప్రయత్నాలు వారు చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఉన్నతాధికారుల ద్వారా కూడా ప్రయత్నాలు చేశారని తెలిసింది. గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ పోస్టింగ్ విషయంలో ఇద్దరు టీడీపీ నేతల మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తాయని సమాచారం. తాము సూచించిన తహసీల్దార్‌కే పోస్టింగ్ ఇవ్వాలని వారిద్దరూ పట్టుబట్టారని తెలిసింది. అయితే ఓటర్లు అధికంగా ఉన్న గుంటూరు పశ్చిమ మండల నేత మాటే చివరికి నెగ్గింది. పెదకాకాని మండలానికి రెండేళ్ల క్రితం డిప్యూటేషన్‌పై వచ్చిన ఏపీ సచివాలయం ఉద్యోగి ఇక్కడే కొనసాగేందుకు శతవిధాల ప్రయత్నించారన్న చర్చ జరుగుతున్నది. తహసీల్దార్ల కొరత ఉండటంతో ఐదు మండలాలను ఖాళీగా పెట్టారు. వచ్చే నెలలో జరిగే సాధారణ బదిలీల్లో వాటికి పూర్తిస్థాయి తహసీల్దార్లను నియమించే అవకాశం ఉన్నది.

తహసీల్దార్లకు మండలాలు ఇలా..

జీవీఎస్ ఫణీంద్రబాబు(గుంటూరుపశ్చిమ), డీ పద్మనాభుడు(మేడికొండూరు), ఎస్ శ్రీకాంత్ కేదార్ నాథ్ (పెదనందిపాడు), జీ నాంచారయ్య (ఫిరంగిపురం), కే రవిబాబు(ప్రత్తిపాడు), కే నాసరయ్య (తాడికొండ), జీ సిద్ధార్థ(కొల్లిపర), కే శ్రీనివాసశర్మ (చేబ్రోలు), బీ వెంకటస్వామి(కాకుమాను), షేక్ మెహబూబ్‌సుభాని (మంగళగిరి), కేవీ గోపాలకృష్ణ (తెనాలి), పీ నగేష్(పెదకాకాని), ఎం నాగిరెడ్డి(వట్టిచెరుకూరు), ఎం పూర్ణచంద్రరావు (కలెక్టరేట్ ఏవో), కే మల్లీశ్వరి(కలెక్టరేట్ మేజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్), కే సాంబశివరావు(కలెక్టరేట్ భూ వ్యవహారాల సెక్షన్ సూపరింటెండెంట్), షేక్ ఇస్మాయిల్(కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరిం టెండెంట్), కే కల్యాణి(గుంటూరు ఆర్‌డీవో కార్యాలయం డీఏవో), జే ప్రసాదరావు(తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం డీఏవో)గా పోస్టింగ్‌లు పొందారు. కాగా దుగ్గిరాల డీటీయూ రాజేష్, తాడేపల్లి డీటీ ఎస్ సతీష్, తుళ్లూరు డీటీ వసంతరావు, గుంటూరు తూర్పు డీటీ షేక్ రిజ్వాన్, పొన్నూరు డీటీ ప్రశాంతిని ఆయా మండలాలకు ఇన్‌చార్జి తహసీల్దార్లుగా తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు పూర్తి అదనపు బాధ్యతలు కల్పించారు. పెదకాకాని తహసీల్దార్ రత్నంని రిలీవింగ్ చేసి తదుపరి పోస్టింగ్ కోసం జీఏడీలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు.

దిక్సూచి


గుంటూరు ● సోమవారం 29 జూలై 2024
diksuchi@andhrajyothy.com

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 స్థానంలో భారతీయ సాక్ష్య అధినియమ్‌ను ప్రవేశపెట్టారు. గతంలో ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లో 167 సెక్షన్లు ఉండగా, ప్రస్తుతం బీఎస్ఏలో 170 సెక్షన్లు ఉన్నాయి. గత చట్టంలోని 23 సెక్షన్లలో మార్పులు చేశారు.

కొత్త క్రిమినల్ చట్టాలు- పార్ట్ 3

భారతీయ సాక్ష్య అధినియమ్



కీలకాంశాలు

- ఈ చట్టం 'డాక్యుమెంట్' నిర్వచనాన్ని విస్తరించింది. ఎలక్ట్రానిక్స్/ డిజిటల్ రికార్డులను కూడా ఈ చట్టం పేపర్ డాక్యుమెంట్స్‌తో సరిసమాన సాక్ష్యాలుగా పరిగణిస్తోంది. ఈ-మెయిల్స్, సర్వర్ లాగ్స్, కంప్యూటర్స్, స్మార్ట్‌ఫోన్స్, ల్యాప్‌టాప్స్, ఎస్సెమ్మెస్‌లు, వెబ్‌సైట్‌లు, లోకేషనల్ ఎవిడెన్స్ వంటి డిజిటల్/ ఎలక్ట్రానిక్స్ సాక్ష్యాలను దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.
- అంతేకాక ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా సాక్ష్యులు, బాధితులు, ముద్దాయిలు తమ వాంగ్మూలం ఇవ్వడానికి ఈ కొత్త చట్టం అనుమతిస్తూ, దానికి వ్యక్తిగత ప్రత్యక్ష వాంగ్మూలంతో సరిసమాన స్థాయి కల్పించింది.
- ముద్దాయి నేరం అంగీకారాన్ని, ఇకపై క్రిమినల్ కేసుల్లో తప్పనిసరిగా పరిగణించక్కర్లేదు. బెదిరింపులు, ప్రలోభాలు తదితరాల కారణంగా నేరాంగీకారం జరిగినట్లు న్యాయమూర్తి భావిస్తే దానిని పరిగణనలోకి తీసుకోనవసరం లేదు.
- సోదాలు, నేర సంఘటన స్థల పరిశీలన సమయంలో తప్పనిసరిగా సంబంధిత అధికారి ఫోన్ ద్వారా చిత్రీకరణ జరపాల్సి ఉంటుంది. అలాంటి దృశ్య, శ్రవణ చిత్రీకరణలు జతచేయని చార్జిషీట్లు చెల్లవు. ఈవిధంగా చిత్రీకరించిన దృశ్య, శ్రవణ చిత్రీకరణలు నేరుగా క్లౌడ్ బేస్డ్ ప్లాట్‌ఫాంలోకి అప్‌లోడ్ చేయవచ్చు. టాంపరింగ్, అవకతవకలు నివారించడానికి ఎటువంటి జాప్యం లేకుండా వీటిని కోర్టుకు సమర్పించాల్సి ఉంది.
- కోర్టుల్లో పరీక్షించలేని భారీ పరిణామం గల డాక్యుమెంట్స్ లేదా సాంకేతికపరమైన డాక్యుమెంట్ల పరిశీలనలో నిష్ణాతులైన వారు ఇచ్చే వాంగ్మూలాన్ని సెకండరీ ఎవిడెన్స్(ద్వితీయస్థాయి సాక్ష్యం)గా పరిగణిస్తారు.
- ఒక నేరంలో భాగమైన వ్యక్తులను సామూహికంగా విచారిస్తున్నప్పుడు (జాయింట్ ట్రయల్) వారిలో ఎవరైనా అరెస్ట్ వారెంట్ అందుకోకపోయినా, పరారీలో ఉన్నా సరే వారిని కూడా కలిపే న్యాయవిచారణ చేస్తారు.

విమర్శలు

- సాక్ష్యాధారాలు చిత్రీకరించే సమయంలో, తదుపరి కూడా నేటి ఆధునిక సాంకేతికతల సహాయంతో, సాంకేతికపరమైన లోపాల సహకారంతో ఏమార్చే అవకాశం ఉంది.
- ఎలక్ట్రానిక్ రికార్డులు ధృవీకరణ పొంది ధ్రువపత్రాలను కలిగి ఉన్నప్పుడే వాటిని డాక్యుమెంట్స్‌గా పరిగణిస్తారు. కానీ బీఎస్ఏలో సాధారణ డిజిటల్, ఎలక్ట్రానిక్ సమాచారాన్ని కూడా సాక్ష్యంగా డాక్యుమెంట్ల స్థాయి కల్పించి పరిగణించడం వైరుధ్యాలకు కారణం అవవచ్చు.
- పోలీసు కస్టడీలోని వ్యక్తి శరీరంపై ఉన్న గాయాలకు పోలీసులు బాధ్యత వహించాలి అనే అత్యున్నత న్యాయస్థానం, లా కమిషన్ సిఫార్సులకు మన్నన దక్కలేదు. అట్టి కట్టుబాటు పోలీసులపై ఏర్పడలేదు.
- కేవలం ఏవో కొన్ని అంశాలు మినహా పాత చట్టమే కొత్తరూపుతో కొనసాగింపునకు వచ్చింది. సాంకేతిక అంశాల జోడింపు తప్ప ఇతరత్రా పెద్దగా విప్లవాత్మక మార్పులు ఏమీ లేవు.
- కొన్ని క్రిమినల్ కేసుల్లో ఫోరెన్సిక్ దర్యాప్తు తప్పనిసరి చేశారు. కానీ నేర స్థలానికి మొదట వెళ్లేది పోలీసులు. వారి సోదాలు, పరిశీలనల చిత్రీకరణల వల్ల ఫోరెన్సిక్ ఆధారాలు భంగపడవచ్చు.

అయితే సాంకేతిక అంశాల జోడింపుతో ఈ కొత్తచట్టం విచారణలో వేగాన్ని తీసుకురావడానికి తోడ్పడటంతోపాటు మారుతున్న నేరాల సరళి నేపథ్యంలో సాక్ష్యాల పరిధిని విస్తరించిందనడం అతిశయోక్తి కాదు. అదేవిధంగా నేరవిచారణలో, దర్యాప్తులో అక్రమాలను నిరోధించేందుకు సాంకేతికపరంగా చేసిన మార్పులు పారదర్శకతను పెంపొందించగలవు. అయితే గత చట్టంలోని అన్ని అంశాలను పూర్తిగా సంస్కరించలేదు. కేవలం కొద్దిపాటి అంశాల్లోనే మార్పులు చేసి కొత్త చట్టాన్ని రూపొందించారు. అయినప్పటికీ దశాబ్దాల తరబడి క్రిమినల్ చట్టాల్లో సంస్కరణలకు నోచుకోని పరిస్థితుల్లో దీనిని ఒక ముందడుగు గానే పరిగణించాలి.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

ఏపీపీఎస్సీ/ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఘనము

రీజనింగ్

I) 8 సెం॥ మీ॥ల కొలత ఉన్న చతురస్రాకార చెక్క ఘనానికి అన్ని వైపుల ఎరుపు రంగును వేశారు. ఇప్పుడు ఈ ఘనాన్ని ప్రతి అంచు 2 సెం॥ మీ॥ల కొలత ఉండే చిన్న చిన్న ఘనాలుగా విభజించారు. ఈ సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

1. ఆ విభజన వల్ల మొత్తం ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
   ఎ) 20 బి) 40 సి) 56 డి) 64
2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
   ఎ) 8 బి) 6 సి) 12 డి) 16
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
   ఎ) 16 బి) 24 సి) 32 డి) 48
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
   ఎ) 12 బి) 18 సి) 10 డి) 24
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
   ఎ) 18 బి) 12 సి) 8 డి) 6

సమాధానాలు:
1. (డి) 2. (ఎ) 3. (బి) 4. (డి) 5. (సి)

వివరణ:

1. $n = \frac{\text{పెద్ద ఘనము యొక్క అంచు పొడవు}}{\text{చిన్న ఘనము యొక్క అంచు పొడవు}} = \frac{8}{2} = 4$

   మొత్తం ఘనాలు = $(n^3) = 4^3 = 64$.
2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే 8 (ఫిక్స్ ఎప్పటికి మారదు).
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
   $(n - 2) \times 12 = (4 - 2) \times 12 = 2 \times 12 = 24$
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
   $(n-2)^2 \times 6 = (4-2)^2 \times 6$
   $= (2)^2 \times 6 = 4 \times 6 = 24$
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు
   $(n-2)^3 = (4-2)^3 = 2^3 = 8$

సులభపద్ధతి: 8 సెం.మీ. కొలత ఉన్న ఘనం 2 సెం॥ మీ॥ కొలతతో విభజిస్తే అంటే నాలుగు నాలుగుగా ఏర్పడుతుంది. ఇప్పుడు నాలుగు నాలుగుగా ఉండే రేఖాచిత్రం ఔట్‌సైడ్ మాత్రమే వేసుకోవాలి.

3	2	2	3
2	1	1	2
2	1	1	2
3	2	2	3

1. మొత్తం ఘనాలు అంటే $4^3 = 64$
2. మూడు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే కార్నర్ 4ని 2తో గుణించాలి. (2 అంటే పై వైపు 4 కార్నర్స్ కింది వైపు 4 కార్నర్స్ అని అర్థం) $4 \times 2 = 8$
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న, ఘనాలు అంటే కార్నర్స్ కాకుండా చుట్టూ ఉన్న వాటిని లెక్కించి 3తో గుణించాలి. (3 అంటే పై వైపు, కింద వైపు, మధ్య వైపు) పై రేఖాచిత్రం గమనించిన కార్నర్స్‌ని తీసివేయగా చుట్టూ భాగంలో మిగిలినవి 8. దీనిని 3తో గుణించగా $8 \times 3 = 24$.
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే చుట్టూ భాగాన్ని తొలగించి మధ్యలోని భాగంలో గల వాటిని లెక్కించి 6తో గుణించాలి. (6 అంటే ఆరు ముఖాలు అని అర్థం) పై రేఖాచిత్రం గమనించిన చుట్టూ భాగాన్ని తీసివేయగా మధ్యలో 4 ఉన్నాయి. కావున $4 \times 6 = 24$.
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు అంటే మొత్తం - (ఒక ముఖానికి, రెండు ముఖాలకు, మూడు ముఖాలకు రంగును కలిగి ఉండే ఘనాలు)
   $64-(24+24+8) = 64 - 56 = 8$ సమాధానం అవుతుంది.

II) 15 సెం॥ మీ॥ల కొలత ఉన్న చతురస్రాకార చెక్క ఘనానికి అన్ని వైపుల పసుపు రంగును వేశారు. ఇప్పుడు ఈ ఘనాన్ని ప్రతి అంచు 3 సెం.మీ.ల కొలత ఉండే చిన్న చిన్న ఘనాలుగా విభజించారు. ఈ సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

1. ఆ విభజన వలన మొత్తం ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
   ఎ) 100 బి) 150 సి) 125 డి) 175
2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
   ఎ) 16 బి) 8 సి) 24 డి) 12
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
   ఎ) 36 బి) 12 సి) 48 డి) 24
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
   ఎ) 48 బి) 54 సి) 63 డి) 52
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
   ఎ) 12 బి) 18 సి) 27 డి) 36

సమాధానాలు: 1. (సి) 2. (బి) 3. (ఎ) 4. (బి) 5. (సి)

వివరణ:

1. $n = \frac{\text{పెద్ద ఘనము యొక్క అంచు పొడవు}}{\text{చిన్న ఘనము యొక్క అంచు పొడవు}} = \frac{15}{3} = 5.$

   మొత్తం ఘనాలు $n^3 = 5^3 = 125$
2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే 8 (ఫిక్స్ ఎప్పటికి మారదు)
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
   $(n-2) \times 12 = (5-2) \times 12 = 3 \times 12 = 36$
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
   $(n-2)^2 \times 6 = (5-2)^2 \times 6$
   $= 3^2 \times 6 = 9 \times 6 = 54$
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు $= (n-2)^3$
   $= (5-2)^3$
   $= 3^3 = 27.$

సులభ పద్ధతి: 15 సెం.మీ. కొలత ఉన్న ఘనం 3 సెం.మీ.ల కొలతతో విభజించడం అంటే 15÷3=5 అయిదు అయిదుగా ఏర్పడుతుంది. ఇప్పుడు అయిదు అయిదుగా ఉండే రేఖాచిత్రం వన్ సైడ్ మాత్రమే వేసుకోవాలి.

3	2	2	2	3
2	1	1	1	2
2	1	1	1	2
2	1	1	1	2
3	2	2	2	3

1. మొత్తం ఘనాలు అంటే $5^3 = 125$.
2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా కార్నర్స్ 4ని 2తో గుణించాలి. (2 అనగా పై వైపు 4 కార్నర్స్, కింది వైపు 4 కార్నర్స్ అని అర్థం) $4 \times 2 = 8$.
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా కార్నర్స్ కాకుండా చుట్టూ ఉన్న వాటిని లెక్కించి 3తో గుణించాలి. (3 అనగా పై వైపు, కింది వైపు, మధ్యవైపు) పై రేఖాచిత్రం గమనిస్తే కార్నర్స్‌ని తీసివేయగా చుట్టూ భాగంలో మిగిలింది 12. దీనిని 3తో గుణిస్తే $12 \times 3 = 36$.
4. ఒక ముఖానికి మాత్రమే రంగును ఉన్న ఘనాలు అనగా చుట్టూ భాగాన్ని తొలగించి మధ్యలో ఉండే వాటిని లెక్కించి 6తో గుణించాలి. (6 అనగా ఆరు ముఖాలు అని అర్థం)పై రేఖాచిత్రం గమనిస్తే చుట్టూ భాగాన్ని తీసివేయగా మధ్యలో 9 ఉన్నాయి. కాబట్టి $9 \times 6 = 54$.
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు అంటే మొత్తం - (ఒక ముఖానికి, రెండు ముఖాలకు, మూడు ముఖాలకు రంగును కలిగి ఉండే ఘనాలు)
   $125 - (54+36+8)$
   $125 - 98 = 27$ సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

నవ్య | చిత్రజ్యోతి



పారిస్ వీధుల్లో పలకరింపు

ప్రస్తుతం మెగా ఫ్యామిలీతో కలసి రామ్‌చరణ్ పారిస్‌లో ఒలింపిక్స్ క్రీడా సంబరాలను ఆస్వాదిస్తున్నారు. భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు మహిళల సింగిల్స్‌లో తొలి విజయాన్ని నమోదు చేశారు. వీరిద్దరూ పారిస్ వీధుల్లో అనుకోకుండా ఒకరికొకరు ఎదురు పడ్డారు. చిరునవ్వుతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. రామ్‌చరణ్ పెంపుడు కుక్క 'పిల్ల రైమ్' తలనిమిరారు సింధు. వారిద్దరూ సరదాగా మాట్లాడుకుంటున్న వీడియో ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇద్దరూ గేమ్ ఛేంజర్‌లే మీ కలయిక అద్భుతం అంటూ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' చిత్రంలో నటిస్తున్నారు.

సరికొత్త కాన్సెప్ట్‌తో...



వైవిధ్యమైన చిత్రాలతో దూసుకుపోతున్న కథానాయకుడు అల్లరి నరేశ్. ఆయన హీరోగా 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఓ నూతన చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రుహాని శర్మ హీరోయిన్. సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమాను ఆరంభించారు. సరికొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రేక్షకులకు మంచి అనుభూతిని అందిస్తుందని మేకర్స్ తెలిపారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: రామకృష్ణ అర్రం, కెమెరా: జిజు సన్నీ, సంగీతం: జిబ్రాన్.



కొత్త తరహా పాత్ర

తమిళ హీరో ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న 'కుబేర' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ధనుష్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. ఇదివరకు ఎన్నడూ చేయని పాత్రను ధనుష్ ఇందులో పోషిస్తున్నారు. ఆయన పెర్ఫార్మెన్స్ నెక్స్ట్ లెవల్‌లో ఉంటుందని మేకర్స్ చెప్పారు. హై బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ సోషల్ డ్రామాలో రష్మిక కథానాయిక. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్‌మోహనరావు తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఫిల్మ్ ఛాంబర్ కొత్త అధ్యక్షుడిగా భరత్ భూషణ్



తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి ప్రస్తుత అధ్యక్షుడు దిల్ రాజు పదవీకాలం ముగియడంతో ఆదివారం ఎన్నికలు జరిపి నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు.. ఈసారి డిస్ట్రిబ్యూటర్ సెక్టార్ నుంచి పి.భరత్ భూషణ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా కె.అశోక్‌కుమార్ గెలిచారు. ఈ సందర్భంగా నిర్మాత సి.కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ 'పరిశ్రమలో చాలా సమస్యలు ఉన్నాయి. అందరం కలసి మంచి నిర్ణయాలతో ముందుకు వెళతాం. ఈ రోజు గెలిచిన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మాటకు కట్టుబడి ఉండే వ్యక్తులు. గెలిచిన వారికి సభ్యులందరి మద్దతు ఉంటుంది' అన్నారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 'ఛాంబర్ అంతా ఒక కుటుంబం. పరిశ్రమలోని సమస్యలను ఎలా ఎదుర్కోవాలో అందరం కలసి చర్చిస్తాం. భారతదేశంలోని అన్ని పరిశ్రమలను ఒక తాటి మీదకు తీసుకు వచ్చి ముందుకు వెళతాం' అన్నారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ భరత్ భూషణ్ కృతజ్ఞతలు తెలిపారు.

'మిరపకాయ్' కంటే మెరుగ్గా



రవితేజ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో తయారవుతున్న 'మిస్టర్ బచ్చన్' రిలీజ్ డేట్ దగ్గర పడుతుండడంతో నిర్మాతలు ప్రమోషన్స్‌లో దూకుడు పెంచారు. ఇందులో భాగంగా ఆదివారం టీజర్ విడుదల చేశారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో తెర కెక్కిన ఈ చిత్రంలో ఓ పవర్‌ఫుల్ వ్యక్తిపై రైడ్ చేసే ఇన్‌కమ్ టాక్స్ అధికారిగా రవితేజ నటిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. జగపతిబాబు కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో మీడియాతో హరీశ్ శంకర్ మాట్లాడుతూ '1980-90ల మధ్య జరిగే కథ ఇది. ల్యాండ్ ఫోన్లు, క్యాసెట్ రికార్డింగ్ సెంటర్లు, చేతక్ స్కూటర్లు, కుమార్ షాను పాటలు.. ఇవన్నీ 'మిస్టర్ బచ్చన్' ఫస్ట్ హాఫ్‌లో నోస్టాలజిక్ మూమెంట్స్‌గా ఉంటాయి. అలాగే అమితాబ్ గారిని బేస్ చేసుకుని కొన్ని ఐటెమ్స్ ఉంటాయి. నా కెరీర్‌లో చాలా ఫాస్ట్‌గా.. కేవలం 78 రోజుల్లో ఈ సినిమా తీశానంటే కారణం నిర్మాత విశ్వప్రసాద్‌గారు. ఇంతకుముందు మా కాంబినేషన్‌లో వచ్చిన 'మిరపకాయ్' కంటే మెరుగ్గా ఈ సినిమా ఉంటుంది' అన్నారు. 'ఆగస్టు 15న సినిమాను విడుదల చేస్తున్నాం' అని విశ్వప్రసాద్ తెలిపారు.

సుకుమార్ సతీమణి సమర్పణలో..



రావు రమేశ్ హీరోగా నటించిన 'మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం' ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు సుకుమార్ సతీమణి తబిత సమర్పణలో వస్తున్న తొలి చిత్రం ఇది కావడం విశేషం. కంటెంట్ నచ్చడంతో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ ఆగస్టు 23న విడుదల చేస్తోంది. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో రామ్‌చరణ్ ఆదివారం విడుదల చేశారు. 'మారుతీనగర్ సుబ్రహ్మణ్యం' చిత్రంలో ఎటకారం ఎక్కువున్న సుబ్రహ్మణ్యం భార్యగా ఇంద్రజ, అత్తగారిగా అన్నపూర్ణమ్మ నటించారు. 'మా నాన్న అల్లు అరవింద్' అంటూ గొప్పలు చెప్పి ఓ డబ్బున్న అమ్మాయిని ప్రేమలో పడేసే సుబ్రహ్మణ్యం కొడుకుగా అంకిత్ కొయ్య, అతని సరసన రమ్య పసుపులేటి నటించారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు.



ఆ లోటును భర్తీ చేసేలా...

'నువ్వేకావాలి', 'మన్మథుడు', 'మల్లీశ్వరి' వంటి చిత్రాలతో పాపులర్ దర్శకుడిగా మారారు కె. విజయ్‌భాస్కర్. ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఉషా పరిణయం'. 'లవ్ ఈజ్ బ్యూటిఫుల్' అనేది ఉపశీర్షిక. ఈ లవ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లో శ్రీకమల్, తాన్వీ ఆకాంక్ష, సూర్య ప్రధాన తారాగణంగా నటించారు. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా కె. విజయ్‌భాస్కర్ మీడియాతో ముచ్చటించారు. 'ఈ సినిమా ప్రేమకు సరికొత్త నిర్వచనం ఇస్తుంది. ఈ మధ్య కాలంలో ప్రేమ కథలు చాలా తక్కువగా వస్తున్నాయి. ఇది ఆ లోటును భర్తీ చేస్తుంది. ఇంటిల్లిపాదీ చూడదగిన చిత్రమిది. ఉషా అనే అమ్మాయి పెళ్లి చుట్టూ సినిమా కథాంశం సాగుతుంది. మా అబ్బాయి కమల్ కోసం ప్రత్యేకంగా కథ రాసుకుని ఈ సినిమా చేయట్లేదు. ఈ కథకు తను యాప్ట్ కాబట్టే కమల్‌ను హీరోగా ఎంచుకున్నాను. కమల్, కథానాయిక తాన్వీ నటన చాలా సహజంగా.. అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ సినిమాకు సంగీతం ప్రధానాకర్షణ. ఆర్.ఆర్.ధ్రువన్ అద్భుతమైన పాటలు అందించారు. సినిమా యూత్‌తో పాటు ఫ్యామిలీని కూడా ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

కాలరెత్తి తిరగరా...



దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'లక్కీ భాస్కర్'. మీనాక్షి చౌదరి కథానాయిక. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 7న విడుదలవుతోంది. ఆదివారం దుల్కర్ సల్మాన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం 'లక్కీ భాస్కర్' టైటిల్ ట్రాక్‌ను విడుదల చేసింది. 'శభాష్ సోదరా...కాలరెత్తి తిరగరా...కరెన్సీ దేవి నిను వరించెరా' అంటూ సాగే ఈ గీతానికి రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. జీవీ ప్రకాశ్ కుమార్ స్వరాలందించారు.

ఆకాశంలో ఒక తార

పవన్ సాధినేని దర్శకత్వంలో దుల్కర్ కథానాయకుడిగా నటించబోయే కొత్త చిత్రంపై అధికారిక ప్రకటన వచ్చింది. ఈ సినిమాకు 'ఆకాశంలో ఒక తార' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్ బాక్స్ మీడియా సమర్పణలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో రైతు లుక్‌లో దుల్కర్ కనిపించారు. త్వరలో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించనున్నట్లు మేకర్స్ తెలిపారు.

శాంతి స్థాపనతోనే సుస్థిరాభివృద్ధి

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



కార్యక్రమంలో విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శాంతి స్థాపనతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ రజతోత్సవ చిత్ర ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా వివిధ కళాశాలల విద్యార్థులతో మాట్లాడారు. తొలుత కార్గిల్ యుద్ధంలో అమరవీరులైన జవాన్లకు ఎమ్మెల్సీ నివాళులర్పించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మొదటి, రెండు ప్రపంచయుద్ధాలు మొదలుకుని ప్రస్తుతం కొనసాగుతోన్న ఇజ్రాయెల్-పాలస్తీనా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాల వరకు మూలకారణానికి పరిష్కారం లేకుండా అపారమైన విధ్వంసం, మానవనష్టం జరుగుతున్నాయన్నారు. దేశాలు యుద్ధాల కంటే చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు సమకాలీన అంశాలపై తమదైన దృక్కోణాలు ఏర్పరుచుకోవడానికి, విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి తగిన సమయం వెచ్చించాలని లక్ష్మణరావు కోరారు. రాష్ట్రంలో సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ క్షేత్రస్థాయి ప్రచారం చేసే సీబీసీకి చెందిన వివిధ కార్యకలాపాలను డైరెక్టర్ పి.రత్నాకర్ వివరించారు. దేశ నిర్మాణంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని కోరారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డైరెక్టర్ డాక్టర్ జీడీ హల్లెకెరి మాట్లాడుతూ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడే సాయుధ సిబ్బందిని గౌరవించడం వల్ల అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్ట పెరుగుతుందన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులను సీబీసీ సీనియర్ ఏవో శ్రీదేవినాయర్ అభినందించారు. సీబీసీ క్షేత్ర ప్రచార అధికారి ఆర్ రమేశ్చంద్ర మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధ సమయంలో కార్గిల్, లేహ్ పౌరుల సహకారాన్ని విస్మరించలేమని అన్నారు.

ఇసుక రీచ్‌లో దళారులు కనిపిస్తే కేసులు నమోదు చేయండి

● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, జులై 28: పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని ఇసుక స్టాక్ పాయింట్‌ల వద్ద ఇసుక బుకింగ్ చేసుకుని బిల్లులను లారీ డ్రైవర్‌లకు అధిక ధరలకు అమ్ముకునే దళారులు కనిపిస్తే కేసులు నమోదు చేయాలని పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ అన్నారు. మండల పరిధిలోని వైకుంఠపురం ఇసుక స్టాక్ పాయింట్ వద్ద జరుగుతున్న దళారుల దందాపై ఆయన తీవ్రంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల ఉపాధి కోసం, పేదల ఇండ్ల నిర్మాణం కోసం తీసుకువచ్చిన ఉచిత ఇసుక పాలసీని కొందరు దళారులు నిర్వీర్యం చేస్తూ ఇసుక అధిక ధరలకు అమ్ముకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసిందన్నారు. అలాంటి సంఘటనలు పునరావృతమైతే క్షమించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ, పోలీసు అధికారులు సత్వరం స్పందించి ఇసుక బుకింగ్, లోడింగ్ వద్ద క్యూపద్ధతి పాటించేలా చర్యలు తీసుకోవాలని, క్యూలో వచ్చిన వాహనాలకు మాత్రమే ఇసుక బుకింగ్, లోడింగ్ చేయాలని ఆదేశించారు. స్టాక్ పాయింట్‌ల వద్ద ఏ పార్టీకి చెందిన దళారులైనా క్షమించేదిలేదని ప్రవీణ్ హెచ్చరించారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం వైకుంఠపురం రీచ్‌లో ఒక ఎస్ఐ, ఇద్దరు సిబ్బందిని ఉంచి ఇసుక బుకింగ్ సక్రమంగా జరిగేలా, వాహనాలు క్యూపద్ధతిలో వచ్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వాహనాలు లేకుండా ఇసుక బుకింగ్ చేసుకుంటే అనుమతించేది లేదని సీఐ బ్రహ్మం తెలిపారు.

కేంద్ర బడ్జెట్ ద్వారా రాష్ట్రానికి రూ. 80వేల కోట్లు

● వివిధ కేంద్ర పథకాల ద్వారా మరింత లబ్ధి ● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ ద్వారా రాష్ట్రానికి రూ.80వేల కోట్లు వస్తున్నాయని గ్రామీణాభివృద్ధి శాఖ కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా అమరావతికి ఎవరూ ఊహించని రీతిలో రూ.15వేల కోట్ల కేటాయింపులు జరిగాయన్నారు. వచ్చే రెండు మూడేళ్లలో పోలవరాన్ని పూర్తిచేసేందుకు కేంద్రం సంసిద్ధత ప్రకటించిందని చంద్రశేఖర్ అన్నారు. పెరిగిన అంచనాలను సైతం పూరిస్తూ పోలవరం ప్రాజెక్టుకు రూ.30వేల కోట్ల నుంచి రూ.40వేల కోట్లు కేంద్రం కేటాయించే అవకాశం వచ్చిందన్నారు. అమరావతిలో రూ.2,500కోట్లతో రైల్వేలైను మంజూరైందని, ఔటర్ రింగ్‌రోడ్డుకు రూ.12వేల కోట్ల నుంచి రూ.15వేల కోట్ల విలువ అవుతుందని, దానికి భూసమీకరణ బాధ్యత కూడా కేంద్రం తీసుకుని రాష్ట్రానికి వెసులుబాటు కల్పించిందని తెలిపారు. వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం జిల్లాను కూడా చేర్చి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తున్నారు. మొత్తంగా చూస్తే ఈ బడ్జెట్ ద్వారా రూ.80వేల కోట్ల నిధులు మన రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. అవేకాకుండా కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని, తగినన్ని నిధులు కేటాయిస్తే మరింత ప్రయోజనం పొందవచ్చన్నారు. నరేగా నిధుల కేటాయింపు పెరిగింది. ఉపాధి హామీ పథకం ద్వారా నరేగా నిధులు వాడుకుని గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించవచ్చన్నారు. తద్వారా కూలీలకు ఉపాధి హామీ లభిస్తుందన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా ప్రతి వ్యక్తికి రూ.5లక్షల కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య బీమా వస్తుందని, ప్రతి ఒక్కరికీ ఆయుష్మాన్ భారత్ కార్డులు వచ్చేల కృషి చేస్తామన్నారు. గతంలో గుంటూరు జిల్లాలో 3లక్షల మందికి అవకాశం వస్తే, 28వేల మందికి మాత్రమే కార్డులు వచ్చాయన్నారు. అలా జరగకుండా పథకాన్ని సద్వినియోగం చేస్తామన్నారు. జలజీవన్ మిషన్లో 14వేల కోట్లు కేటాయిస్తే మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వకుండా జగన్‌రెడ్డి రూ.12వేల కోట్లు వాడకుండా వదిలేశారని పెమ్మసాని విమర్శించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో కలిసి ఈ పథకం ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి అందించే ప్రయత్నం చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్లో నిరుద్యోగ సమస్య, రైతాంగ సమస్యలను పరిష్కరించడంపై దృష్టిపెట్టిందన్నారు. పేదలకు ఉచితంగా విద్యుత్ అందించే సోలార్ స్కీంను ముందుకు తెచ్చిందన్నారు. ఇంకా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, మీడియా సెల్ నేత ప్రాతూరి నాగభూషణం మాట్లాడుతూవికసిత్ భారత్, వికసిత్ ఆంధ్ర లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు జరిగాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్, టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, తాళ్ల వెంకటేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్

బహుముఖ ప్రజ్ఞాశాలి కేతు

● కేతు స్మృతి సంచిక ఆవిష్కరణలో మధురాంతకం నరేంద్ర

కడప (కల్చరల్), జూలై 28 : సంపాదకుడిగా, కథకుడిగా, విమర్శకుడిగా, విద్యావేత్తగా కేతు విశ్వనాథరెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలి అని ప్రసిద్ధ కథా నవలా రచయిత మధురాంతకం నరేంద్ర అన్నారు. రాయలసీమ ప్రాతినిధ్య కథకుడు కేతు విశ్వనాథరెడ్డి 85వ జయంతిని పురస్కరించుకుని కథారచయిత పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి నిర్వహణలో ఆదివారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో కేతు స్మృతి సంచిక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రసిద్ధ రచయిత దాదాహయాత్ అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా అరసం జాతీయ అధ్యక్షుడు పెనుకొండ లక్ష్మీనారాయణ కేతు స్మృతి సంచిక కేతు తలపులలో అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రధాన ప్రసంగాన్ని మధురాంతకం నరేంద్ర చేశారు. రాయలసీమ ప్రాతినిధ్య కథకుడిగా ఈ ప్రాంతపు ఆర్థిక, సాంఘిక, సంక్లిష్టతలను, సంక్షోభాలను, వాటి మాటున దాగిన మానవీయ కోణాలను ప్రతిభావంతంగా చిత్రీకరించిన కథకు నిలువెత్తు రూపం కేతు అన్నారు. సాహిత్యమే జీవితంగా కేతు బతికారన్నారు. కేతులో ఇద్దరు మనుషులున్నారని, భిన్నమైనవారు కాదు, పరిపూర్ణమైన వారు కాదు, అయినా భిన్నంగా కనిపిస్తారన్నారు. ఇలాంటి రచయితలు చాలా అరుదుగా ఉంటారన్నారు. ఆయన నమ్మిన విషయాన్ని ఎదుటివారికి నొప్పి లేకుండా చెప్పడంలో చాలా దిట్ట అన్నారు. ప్రధానంగా కేతులో రాయలసీమ తాలూకా బైరాగి లక్షణాలుండేవన్నారు. భౌతికంగా కేతు మన మధ్య లేకపోయినా ఆయన రాసిన కథలు మనలను వెంటాడుతూనే ఉంటాయన్నారు. కథా రచయిత కాట్రగడ్డ దయానంద్ మాట్లాడుతూ కేతు రాసిన కథల్లో రాయలసీమ కరువు, స్త్రీ పక్షపాతమూ ఉంటుందని ఆయన కథలను ఉదహరించారు. అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ తాను కథలు రాసిన తొలినాళ్ళలో తన కథల్లో విధి పాత్రను తగ్గించుకోవాలని మంచి సూచన చేశారన్నారు. కథా రచయిత సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ కేతు, సింగమనేనిలు తన కథా రచనకు ముందు వెనుక ఉండి నడిపించారని అన్నారు. ఇంకా విశ్రాంత చరిత్ర అధ్యాపకులు వై.ప్రభాకర్‌రెడ్డి, అరసం జిల్లా అధ్యక్షుడు ఎన్.ఈశ్వర్‌రెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపకులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, సాహితీవేత్తలు సంజీవమ్మ, టక్కోలు మాచిరెడ్డి, సుంకోజి దేవేంద్ర, కేతు విశ్వనాథరెడ్డి కుమార్తె శిరీష, సీనియర్ పాత్రికేయుడు రమణయ్య, సీపీఐ రాష్ట్ర నాయకులు జి.ఓబులేసు, నాయకులు సుబ్రమణ్యం, ఆర్‌సీపీ నాయకులు ఎన్.రవిశంకర్‌రెడ్డితో పాటు పలువురు రచయితలు, పాల్గొన్నారు.



కేతు స్మృతి సంచికను ఆవిష్కరిస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, మధురాంతకం నరేంద్ర, దాదాహయాత్ తదితరులు

ఘనంగా లావు రత్తయ్య పుట్టినరోజు వేడుకలు

గుంటూరు(విద్య), జూలై 28: వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు మాత్రమే తారతమ్య భేదాలు లేకుండా శుభాకాంక్షలు తెలియజేస్తారని అన్నారు. విద్యార్థులందరూ జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తే తాను ఇంకా ఎక్కువ సంతోషిస్తామని తెలిపారు. విద్యార్థులతో తనకున్న అనుబంధం మాటల్లో వర్ణించలేనిదని, అందుకోసమే ప్రతి సంవత్సరం తన పుట్టినరోజును ఇలా విద్యార్థుల మధ్య జరుపుకోవడానికి ఇష్టపడతానన్నారు. క్రియేటివ్‌గా ఆలోచిస్తేనే విజయం సాధించగలరని విద్యార్థులకు సూచించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలోనే విద్యార్థులు సరైన దిశగా ఎదగగలరనే సిద్ధాంతాన్ని తాను మొదటి నుంచి నమ్ముతున్నానని చెప్పారు. అనంతరం పుట్టిన రోజు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ బీ రుద్రమదేవి, వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్, లారా ప్రిన్సిపాల్ డాక్టర్ కే ఫణీంద్రకుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాసబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జే మోహన్‌రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

నామినేటెడ్ పదవుల కేటాయింపులో విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యం కల్పించాలి

● విశ్వబ్రాహ్మణ డిక్లరేషన్‌పై ప్రభుత్వం న్యాయం చేయాలి
● ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరు హనుమంతరావు

గుంటూరు, జూలై 28: ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న నామినేటెడ్ పదవుల కేటాయింపులో విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరు హనుమంతరావు కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం అరండల్‌పేటలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌లో భాగంగా విశ్వబ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి న్యాయం చేయాలని కోరారు. విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రాష్ట్ర మహిళా కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఈశ్వరి మాత ట్రస్ట్ ఏర్పాటు చేయటానికి కమిటీ తీర్మానం చేసిందని, ప్రధానమంత్రి ఉపాధి కల్పన యోజన పథకం సంబంధించి ప్రతి జిల్లా నుండి కనీసం ఐదు యూనిట్లను ఏర్పాటు చేసేందుకు జిల్లా అధ్యక్ష కార్యదర్శుల పర్యవేక్షణలో పనిచేయాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దువ్వూరి నరసింహాచారి, లీగల్ సెల్ అధ్యక్షుడు పేరుసోముల గురుప్రసాద్, గౌరవ అధ్యక్షుడు జవ్వాజి కూర్మాచారి, కోశాధికారి సింహాద్రి ధనుంజయచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ చేజర్ల మనోహరాచారి, ఉపాధ్యక్షుడు గడ్డి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నందవీర ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు అంగలకుదిటి సుశీల, ప్రధాన కార్యదర్శి లక్కోజు సూజత, మహిళా గౌరవ అధ్యక్షులు వాసవి, మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ ముంజంపల్లి నాగరాజకుమారి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు అద్దంకి భద్రయ్య, ప్రధానకార్యదర్శి కందేపు వెంకట్రావు, కొంకిపూడి కోటేశ్వరరావు, వివిధ జిల్లాల కమిటీల నాయకులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతరావు తదితరులు

కౌలు రైతు ఆత్మహత్య



వీరవసంతరావు(ఫైల్)

సత్తెనపల్లి రూరల్, జూలై 28 : అప్పుల బాధ తాళలేక కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నందిగామలో శనివారం రాత్రి జరిగింది. రూరల్ పోలీసులు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పోలినేని వీరవసంతరావు(38) కొన్ని సంవత్సరాలుగా పది ఎకరాల పొలం కౌలుకు తీసుకొని ఐదు ఎకరాలు పత్తి, ఐదు ఎకరాలు మిర్చి సాగు చేస్తున్నారు. ఏ ఏడాదికి ఆ ఏడాది పంటల సాగులో దిగుబడులు తగ్గటం, పంటలు సరిగా పండకపోవటం జరిగింది. పంటల సాగుకోసం సుమారు రూ.7 లక్షల వరకు అప్పులు తీసుకువచ్చాడు. అవి తీర్చేమార్గం లేకపోవటంతో మనస్థాపం చెంది ఇంట్లో పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అది గమనించిన కుటుంబ సభ్యులను ఆయనను చికిత్స నిమిత్తం సత్తెనపల్లికి తీసుకువస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య లక్ష్మీ తిరుపతమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఫిరంగిపురంలో భూమి రికార్డులు పరిశీలించిన సీసీఎల్ఏ



ఫిరంగిపురం తహసీల్దార్ కార్యాలయంలోని కార్స్ బేస్‌స్టేషన్‌ని పరిశీలిస్తున్న సీసీఎల్ఏ జయలక్ష్మి

గుంటూరు (ఫిరంగిపురం), జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురం మండల తహసీల్దార్ కార్యాలయం పరిధిలో జరుగుతున్న రీ-సర్వే పనులకు సంబంధించి రికార్డులను, రిజిస్టర్లతో పాటు వెబ్-ల్యాండ్‌ను రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మీ పరిశీలించారు. ఆదివారం ఆమె సర్వే, సెటిల్మెంట్స్, ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ లత్కర్ శ్రీకేష్ బాలాజీరావుతో కలిసి ఫిరంగిపురం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. తహసీల్దార్ కార్యాలయ పైఅంతస్తులో వున్న రీసర్వేకి సంబంధించిన కార్స్ బేస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. దీని నిర్వహణ, పని చేసే విధానం గురించి సర్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే వెబ్ ల్యాండ్ వివరాలు డిప్యూటీ తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న రాష్ట్ర భూ పరిపాలన చీఫ్ కమిషనర్ జి.జయలక్ష్మీని గుంటూరు జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ భార్గవ్ తేజ పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సర్వే సహాయ సంచాలకుడు నాగ సాయి, డిప్యూటీ తహసీల్దార్ రాజా రమేష్, మండల సర్వేయర్లు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్ బ్యాంక్ ఉద్యోగి మృతి



వెంకటేష్ (ఫైల్)

ప్రత్తిపాడు, జూలై 28: కారు అదుపుతప్పి ఎస్ బ్యాంక్ ఉద్యోగి మృతిచెందిన సంఘటన ప్రత్తిపాడులో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ప్రత్తిపాడు పోలీసుల కథనం ప్రకారం పెదనందిపాడుకు చెందిన మొద్దు వెంకటేష్(31) గత రెండు సంవత్సరాలుగా చెన్నైలోని ఎస్ బ్యాంకులో పనిచేస్తున్నాడు. రెండురోజులు సెలవు పెట్టుకుని స్వగ్రామానికి వచ్చిన ఆయన శనివారం సాయంత్రం తన కారులో గుంటూరుకు వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తరువాత తిరిగి పెదనందిపాడు వెలుతుండగా ప్రత్తిపాడు వద్ద కారు అదుపుతప్పి చెట్టుకు ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకటేష్ అక్కడికక్కడే మరణించాడు. ఈ మేరకు ప్రత్తిపాడు హెడ్‌కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్త చౌడయ్యపై దాడి

రెంటచింతల, జూలై 28: మండల కేంద్రమైన రెంటచింతలలోని ఎర్రబాలెంలో టీడీపీ కార్యకర్త బోయిన చౌడయ్యపై ఆదివారం రాత్రి వైసీపీకి చెందిన కోటయ్య, పిచ్చయ్యతో పాటు మరో ఇద్దరు దాడి చేశారు. చౌడయ్య పశువులకు మేత వేసి వస్తున్న సమయంలో మంచం పట్టెతో దాడి చేసి విచక్షణారహితంగా కొట్టి గాయపరిచారు. అపస్మారక స్థితిలో వున్న చౌడయ్యకు స్థానికంగా చికిత్స చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు చెప్పారు.

పేద విద్యార్థులకు రూ.15లక్షల విలువైన సైకిళ్ల పంపిణీ

● వి.ఆర్.కె. ట్రస్ట్ ద్వారా రవికిరణ్ ఎనలేని సేవలు ● ఎమ్మెల్యే ఆనందబాబు



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, ప్రముఖ పారిశ్రామిక వేత్త రవికిరణ్

కొల్లూరు, జూలై 28: అడిగినవారికి లేదనకుండా సాయం చేస్తూ నిజమైన శ్రీమంతుడుగా కీర్తి ప్రతిష్టలు ఆర్జిస్తున్న వేములపల్లి రవికిరణ్ అభినందనీయులని ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని జువ్వలపాలెంలో వి.ఆర్.కె ట్రస్ట్ ద్వారా ప్రముఖ పారిశ్రామిక వేత్త రవికిరణ్ రూ.15లక్షలు వెచ్చించి 275మంది పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే ఆనందబాబు చేతులమీదుగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశంలోనే ప్రముఖ కాంట్రాక్టర్‌గా ఉన్నప్పటికీ పుట్టిన గ్రామానికి ప్రతి ఆదివారం వస్తూ ఇక్కడ జరుగుతున్న విషయాలను తెలుసుకుని ఇబ్బందులు ఉన్నవారికి ఇతోధికంగా ఆర్థికసాయం అందిస్తున్నారన్నారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాలతో పాటు ఇతర మండలాల వారు సైతం ఆయన వద్ద ఆర్థికసహాయం కోసం రావడం, వచ్చినవారికి లేదనకుండా సహాయం చేస్తున్నారన్నారు. ఇలాంటి వ్యక్తులు ఎదిగితేనే సేవాగుణంతో ఎంతోమంది పేదలకు సహాయం చేసే అవకాశం ఉంటుందన్నారు. చంద్రబాబు గతంలో వేసిన పునాదుల వల్లే అన్ని దేశాల్లో తెలుగువారు ఐటీ రంగంలో ముందున్నారన్నారు. లోకేశ్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలోకి దూసుకు వెళుతుందన్నారు. దాత రవికిరణ్ మాట్లాడుతూ, తాను గ్రామానికి విచ్చేసినప్పుడు నలుగురు పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు సైకిల్ లేక ఇబ్బందులు పడుతున్నామని తన దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. దీంతో సైకిళ్లు లేక పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థినీ విద్యార్థుల గురించి విచారణ చేయించామన్నారు. 275మందికి సైకిళ్లు అవసరమని గుర్తించామని, తరగతులు, వయసుల వారీగా బాలబాలికలకు రూ.15లక్షల వ్యయంతో సైకిళ్లు తయారు చేయించామన్నారు. అంతేకాకుండా పేద విద్యార్థులకు ఎంత ఖర్చుపెట్టి అయినా విద్య నేర్పించేందుకు తాను ముందుంటానని చెప్పారు. కార్యక్రమంలో రేపల్లె డీఎస్పీ పి.మురళీకృష్ణ, గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధ్యతలు మాకొద్దు...!

బాపట్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో వైసీపీ ఓటమి పాలయ్యాక బాపట్ల జిల్లాలోని పార్టీ నేతలు చాలావరకు క్రియాశీలకంగా లేరు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జిల్లా అధ్యక్ష బాధ్యతల విషయంలో కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు కొనసాగడానికి సుముఖంగా లేనట్లు సమాచారం. ఇటీవల జగన్ నిర్వహించిన ఎంపీల సమావేశానికి కూడా ఆయన డుమ్మాకొట్టారు. పలుమార్లు పార్టీవర్గాలు ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించినప్పటికీ అందుబాటులోకి రాలేదని తెలుస్తోంది. రేపల్లె నియోజకవర్గ అసెంబ్లీ సీటు తనని కాదని డాక్టర్ ఈవూరు గణేష్‌కు ఇవ్వడం పట్ల అప్పటి నుంచి ఆయన అసంతృప్తిగా ఉన్నారు. ఫలితాలు వచ్చాక పూర్తిగా సైలెంట్ అయ్యారు. జిల్లా అధ్యక్షుడి నియామకంపై జగన్ కసరత్తు చేస్తున్న నేపథ్యంలో జిల్లాలోని ఏ ఒక్క నాయకుడు పార్టీ పగ్గాలు చేపట్టడానికి సిద్ధంగా లేరని తెలుస్తోంది.

లాకుల గేటు కింద పడి బాలుడి మృతి



లాకుల గేటు కింద పడి మృతిచెందిన బాలుడు

మంగళగిరి, జూలై 28: ప్రమాదవశాత్తూ కెనాల్ లాకుల గేటు కింద పడి ఓ బాలుడు మృతిచెందిన ఘటన పెదవడ్లపూడి గ్రామంలో చోటుచేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామానికి చెందిన తాడిమెల విజయ శ్రీహర్ష(14) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. గ్రామంలోని నంబూరు కెనాల్ వద్ద ఆదివారం ఉదయం పది గంటల సమయంలో స్నేహితులతో కలిసి ఆడుకుంటు న్నాడు. కెనాల్ నుంచి నీళ్లు రాకపోవడంతో గేటును రెండు అడుగుల మేర ఎత్తి వుంచారు. ఈ నేపథ్యంలో గేటు కింద నుంచి శ్రీహర్ష దాటుకుని వచ్చే ప్రయత్నంలో గేటు జారి పడింది. దీంతో శ్రీహర్ష తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని సందర్శించి కారణాలను తెలుసుకున్నారు. లస్కర్‌ను పిలిపించి గేటు పనితీరును పరిశీలించారు. గేటు దించడానికి, ఎత్తడానికి స్క్రూడ్రైవర్ అవసరమని, ఒక్కో సందర్భంలో గేటును కదలిస్తే అది జారిపోవడానికి అవకాశం వుందని లస్కర్ తెలియజేశారు. బాలుడి మృతిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నల్లమల అటవీ ప్రాంతంలో వజ్రాల వేట

కారంపూడి, జూలై 28: మండలంలోని సింగరుట్ల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం పైభాగాన ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలోని కొండల్లో గత రెండు రోజులుగా వర్షాలు పడుతుండడంతో వజ్రాలు దొరుకుతాయని ఆశతో ఆశాజీవులు వెతుకులాట ప్రారంభించారు. కొందరు మట్టి కొండల్లో తవ్వి గుంతల్లో అడుగు భాగాన ఉన్న ప్రతి రాయిని తీసి శుభ్రం చేసి పరిశీలిస్తున్నారు. ఇటీవల కర్నూలు జిల్లాలో వజ్రాలు దొరికాయనే ఆశతో ఈ కొండల్లో సైతం ఉన్నాయని వెతుకులాట ప్రారంభించారు. అయితే శని, ఆదివారాల్లో ఎవరికీ వజ్రాలు దొరికిన దాఖలాలు లేవు. ఆశాజీవులు మాత్రం వదిలిపెట్టకుండా వజ్రాల కోసం అన్వేషణ చేస్తున్నారు.



వజ్రాల కోసం వెతుకుతున్న ఆశాజీవులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00



పంట కాల్వలను పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

పంట కాల్వలను పరిశీలించిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పిట్టలవానిపాలెం, జూలై 28 : మండల పరిధిలోని రామనగర్ (ఎటికట్ట) పంట కాల్వలను చందోలు జలవనరుల శాఖాధికారి సీహెచ్ రవీంద్ర, మండల టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి ఆదివారం బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పరిశీలించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ రానున్న వ్యవసాయతరుణాన్ని దృష్టిలో ఉంచుకొని దెబ్బతిన్న పంటకాల్వగట్టులు, దెబ్బతిన్న డ్రెయిన్‌లు తదితర వాటికి తక్షణమే మరమ్మతులు చేసేందుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖాజీపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడు దండు శ్రీనివాసరాజు, మాజీ సర్పంచ్ మంతెన శ్రీదేవి కృష్ణమూర్తిరాజు, టీడీపీ యువనాయకులు కొత్తపల్లి పృధ్వీరాజు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

అలాగే తెనాలి-నిజాంపట్నం మార్గంలోని పంటకాల్వ లాక్‌లను ఆయాశాఖాధికారులు, రైతులు, పార్టీశ్రేణులతో కలిసి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పరిశీలించారు. జలవనరుల శాఖాధికారులతో మాట్లాడుతూ రైతులకు సాగునీరు ఉందని, పట్టిసీమ ద్వారా ప్రభుత్వం నీటిని విడుదల చేసిందని పంటకాల్వలకు మరమ్మతులు, చిన్న డ్రైనేజి సమస్యలు ఏమైనా ఉంటే రానున్న వ్యవసాయ సీజన్‌కి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. పిట్టలవానిపాలెం, జీఎస్‌పాలెం, ఖాజీపాలెం పంటకాల్వలను పరిశీలించారు. వేగేశన నరేంద్రవర్మతో పాటు రైతులు, పార్టీ శ్రేణులు, కూటమినాయకులు పాల్గొన్నారు.

పండ్ల తోటల విస్తరణకు కృషి

● ప్లాంటేషన్ జాయింట్ కమిషనర్ అశోక్‌కుమార్

బాపట్ల, జూలై 28 : జిల్లాలో పండ్ల తోటల విస్తరణకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ప్లాంటేషన్ జాయింట్ కమిషనర్ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పండ్ల తోట పెంపకంపై రైతులకు అవగాహన, రాయితీ తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ప్లాంటేషన్ జాయింట్ కమిషనర్ అశోక్‌కుమార్ పండ్ల తోటల విస్తరణకు చేపట్టాల్సిన చర్యలు గురించి వివరించారు. ప్రతి మండలంలో 150 ఎకరాలకు తగ్గకుండా పండ్ల తోటలు పెంచినందుకు సమన్వయంతో అధికారులు పని చేయాలని సూచించారు. జిల్లాలో మొత్తం 4,400 ఎకరాల పండ్ల తోటల సాగుకు సెప్టెంబరు నాటికి లక్ష్యంగా అధికారులందరూ పని చేయాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ రాజేష్, ప్లాంటేషన్ మేనేజర్ కిరణ్, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈసీలు, హార్టికల్చర్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ ఎం.అశోక్‌కుమార్

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



కూరపాటి సత్యంరాజు

బాపట్ల, జూలై 28 : వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సత్యంరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈవిషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖలో స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్, రేడియోగ్రాఫర్, ఆప్తాలమిక్ అసిస్టెంట్, థియేటర్ అసిస్టెంట్ మొదలగు కాంట్రాక్ట్ ఉద్యోగులకు నూరు శాతం వేతనం విధానం అమలు చేయాలన్నారు. ఈ విషయమై ఆరోగ్యశాఖ మంత్రికి, మంత్రి నారా లోకేశ్‌కు 500 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఈమెయిల్ ద్వారా సందేశాన్ని పంపించటం జరిగిందన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు బదిలీ సౌకర్యం కల్పించాలన్నారు. ఒక క్యాడర్ ఉద్యోగులను మరో క్యాడర్ వారితో భర్తీ చేయటం సరికాదన్నారు. దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. వీటిపై ప్రభుత్వం స్పందించి తగుచర్యలు తీసుకోవాలని కోరారు.

అమరవీరులకు ఎమ్మెల్యే వేగేశన నివాళి

బాపట్ల, జూలై 28 : పట్టణంలోని జిల్లా త్రిదళ మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా కార్గిల్ యుద్ధంలో అశువులు బాసిన అమరవీరుల పటాలకు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమానికి షేక్ కాలేషా అధ్యక్షత వహించగా సభ్యులు పాల్గొని ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి సన్మానించారు. మాజీ సైనికుల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు ఖాదర్ మస్తాన్, రాష్ట్ర ముఖ్య కార్యదర్శి రెడ్డి శ్రీనివాస వరప్రసాద్, షేక్ యాస్తాని, వంశీకృష్ణ, లక్ష్మీనారాయణ, కామరాజు శ్రీనివాసరెడ్డి, వీర నాగేశ్వరరావు, రాఘవయ్య, లక్ష్మీ, దరియాబి, ఆలి, ప్రశాంత్‌కుమార్, వసంతరావు, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల పటాలకు పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

ప్రతిపక్ష హోదా అడగటం అవివేకం : కొల్లా

బాపట్ల, జూలై 28 : జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇస్తేనే శాసన సభలో అడుగుపెడుతానని ప్రగల్భాలు పలకటం అవివేకానికి నిదర్శనమని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా ఉండే అర్హత జగన్‌కు లేదని ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. ప్రభుత్వ పాలనలో అన్యాయం జరుగుతుంటే సభకు వచ్చి పోరాడి నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. హోదా కోసం కోర్టుకు వెళ్ళటం పదవీకాంక్షకు నిదర్శనమన్నారు.

బండ్ల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ప్రారంభం

పిట్టలవానిపాలెం, జూలై 28 : మండలంలోని చందోలు శివారు వద్ద గల బండ్ల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, స్కీమ్ నిర్వాహకులు, పార్టీశ్రేణులు, రైతులతో కలిసి ప్రారంభించి పంటకాల్వకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ రైతులు ఐకమత్యంగా ఉండి తమవంతు వాట ధనాన్ని సమకూర్చుకొని వ్యవసాయ తరుణంలో లిఫ్ట్‌లను జాగ్రత్త చేసుకోవాలని తెలిపారు. ఈ బండ్ల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ప్రతి ఏడాది సుమారు 1200 ఎకరాలలో రైతాంగం వరి పండించుకుంటున్నారని నిర్వాహకులు తెలిపారు. తొలుత లిఫ్ట్ ఇరిగేషన్ నిర్వాహకులు, రైతులు, ఆయాప్రాంతాల రైతులు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ఎండీ అఫ్జల్, టీడీపీ సీనియర్ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, వేగేశన కిషోర్ రాజు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కనుమూరి సాంబమూర్తిరాజు, గోకరాజు శ్రీధర్‌వర్మ, పెనుమెత్స నరసరాజు, టీడీపీ బాపట్ల పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ ఖాశీం, సయ్యద్ జునేద్, చందోలు గ్రామ టీడీపీ అధ్యక్షుడు మహ్మద్ రజాక్, చందోలు గ్రామ టీడీపీ యువ నాయకులు సయ్యద్ నిజాం, రైల్వే బోర్డు మాజీ సభ్యులు ఎం.ఎస్.నియాజి, పెనుమెత్స రవివర్మ, అలకాపురం సర్పంచ్ మంతెన గంగరాజు, నిజాంపట్నం నాగరాజు, కలకోట చక్రధర్‌రెడ్డి, చందోలు కోటి లింగాచారి, ఆయా గ్రామాల టీడీపీనాయకులు, కార్యకర్తలు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



బండ్ల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, పార్టీ నాయకులు, నిర్వాహకులు

గట్టువారిపాలెంలో విషాదఛాయలు

● క్షతగాత్రులను పరామర్శించిన ప్రజాప్రతినిధులు

బాపట్ల, రేపల్లె, జూలై 28: కొండపాటూరు పోలేరమ్మతల్లికి మొక్కు తీర్చుకునేందుకు వెళ్తుండగా కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం గ్రామ శివారులో జరిగిన ప్రమాదంతో నగరం మండలం గట్టువారిపాలెంలో విషాదం అలుముకుంది. గ్రామానికి చెందిన గట్టు వెంకటేశ్వరమ్మ కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి ట్రాక్టర్‌లో మొక్కు తీర్చుకునేందుకు ఉత్సాహంగా బయల్దేరగా అంతలోనే ప్రమాదం జరిగిందని తెలిసి గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు. సంఘటనా స్థలికి ఆ తర్వాత మృతులను, క్షతగాత్రులను తరలించిన బాపట్ల ఏరియా ఆస్పత్రికి పెద్దసంఖ్యలో గ్రామస్థులు తరలివెళ్లారు. క్షతగాత్రులను టీడీపీ, జనసేన నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, కావూరి శ్రీనివాసరెడ్డి, మత్తి భాస్కర్, డాక్టర్ బెల్లంకొండ నాంచారయ్య తదితరులు ఉన్నారు.



ఆస్పత్రిలో క్షతగాత్రుల పరిస్థితి అడిగి తెలుసుకుంటున్న జేసీ సుబ్బారావు, ఎమ్మెల్యే నరేంద్రవర్మ



మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందిస్తున్న శివప్రసాద్

అంబులెన్స్‌లు ఏర్పాటు చేసిన అన్నం సతీష్

రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి బాపట్ల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన చికిత్స అందించే నిమిత్తం గుంటూరు తరలించేందుకు మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్‌ప్రభాకర్ నాలుగు అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారు. వీరి ఆరోగ్యపరిస్థితి గురించి అన్నం సతీష్ అడిగి తెలుసుకున్నారు. మృతులకు సంతాపం ప్రకటించారు.



ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, టీడీపీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌ను సన్మానిస్తున్న సీబీజెడ్ చర్చి కమిటీ సభ్యులు

ఎమ్మెల్యే వేగేశనను సన్మానించిన సీబీజెడ్ చర్చి కమిటీ

బాపట్ల, జూలై 28 : పట్టణంలోని సీబీజెడ్ చర్చిలో జరిగిన ఆదివారం ప్రార్థనలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్ పాల్గొన్నారు. సంఘస్తులతో కలిసి మాట్లాడి అందరికి అన్నివిధాలా అండగా ఉండి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం చర్చికమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ వేమవరపు విజయ్‌కుమార్, నాయకులు కొల్లూరి వెంకట్రావు, దారి అశోక్, కొండలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

దేవతామూర్తులకు సారెసమర్పించిన పెదమల్లు ఆడపడుచులు

కర్లపాలెం, జూలై 28 : మండలంలోని చింతాయపాలెం గ్రామపంచాయతీ తూర్పుపాలెంలో ఉన్న శ్రీ సోరకాయలంకమ్మతో పాటు 13 మంది దేవతామూర్తులకు పెదమల్లు వారి ఆడపడుచులు ఆదివారం భారీ ఊరేగింపుతో, మేళతాళాలతో అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించి హారతులిచ్చి సారె సమర్పించారు. సోరకాయలంకమ్మతల్లి, శ్రీలక్ష్మీతిరుపతమ్మ, శ్రీ సీతారామమందిరం, గణపవరం ఉర్లమ్మతల్లి, కర్లపాలెం శ్రీపెద్దింటమ్మతల్ల, శ్రీకాళీకమ్మతల్లి, చింతాయపాలెం వీర్లంకమ్మతల్లి, రేణుక, ఎల్లమ్మతల్లులు పలు సీతారామమందిరాలలో ఆడపడుచులు సారె సమర్పించారు. కార్యక్రమంలో పెదమల్లు రంగారావు, మంగమ్మ దంపతులతోపాటు శేషాయమ్మ, సుజాత, రేణుక, అరుణ, భవానీ, దుర్గ, శోభ పాల్గొని భక్తులకు వసతులు కల్పించారు.



అమ్మవార్లకు సారె సమర్పిస్తున్న మహిళలు

ప్రజాసమస్యలపై ఉద్యమాలు చేపడతాం

● కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు

బాపట్ల, జూలై 28 : బాపట్ల జిల్లా కేంద్రంలో ప్రజా ఉద్యమాల కోసం పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల భవన్ నిర్మాణం చేయటం సంతోషదాయకమని కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.శ్రీనివాసరావు అన్నారు. ప్రజాసంఘాల భవనం నూతన కార్యాలయాన్ని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి తదితరులు కలిసి ప్రారంభించారు. ప్రారంభ సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాసంఘాల భవనం ద్వారా ప్రజా సమస్యలపై ఉద్యమాలు విస్తృతం చేస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులు హరిస్తూ తనకు అనుకూలంగా లేని రాష్ట్రాలకు నిధులు తగ్గించటం సిగ్గుచేటు అన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పాతపద్ధతులే కొనసాగిస్తుందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. గత మద్యం పాలసీని వ్యాపారంగా మార్చుకొని అమలు చేస్తుందన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయ కక్షలతో చిరుద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా, ఐకేపీ, వీవోఏ, మధ్యాహ్న భోజనం పథకంలాంటి వాటిలో పనిచేసే కార్మికులను తొలిగించటానికి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి కె.రామారావు, దొప్పలపూడి ప్రమీల, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, సీఐటీయూ నాయకులు ఎన్.బాబురావు, రైతు సంఘం నాయకులు రామారావు, వెంకటరామయ్య, ఎ.శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, తిరుమలరెడ్డి, కె.శరత్, కొండయ్య పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి తదితరులు

ఘనంగా మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ వార్షిక వేడుకలు

బాపట్ల, జూలై 28 : పట్టణంలోని మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ప్రథమ వార్షిక వేడుకలు ఆదివారం జరిగాయి. కార్యక్రమానికి సంస్థ ఛైర్మన్ పావులూరి రమేష్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ 2004వ సంవత్సరంలో ప్రారంభించిన ఈ సంస్థ 70వేల మంది సభ్యులతో, 110 శాఖలతో ఆంధ్ర రాష్ట్రంలో శాంతిరథాలు, మార్చురీ బాక్స్‌లను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 100 మందికి మార్చురీ బాక్స్‌లు, 160 మందికి శాంతిరథాలను ఉచితంగా అందజేయటం జరిగిందన్నారు. కార్యవర్గ సభ్యులకు, డైరెక్టర్‌లకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అతిథులు శరీరదానం, నేత్రదానం, అవయవ దానాలు, తమశరీరభాగాలను మరణానంతరం దానం చేయాలని నిర్ణయించారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా చిలుకూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కె.సుబ్బారావు, కార్యదర్శిగా ఎం.ప్రసన్నాంజనేయులు, జాయింట్ సెక్రటరిగా కె.పద్మజ, కోశాధికారిగా సీహెచ్ కేశవులు, డైరెక్టర్‌లుగా వాసుదేవరావు, ఎల్.వెంకట్రావు, నాగేశ్వరరావులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఉప్పాల సాంబశివరావు, జె.వెంకటేశ్వర్‌రెడ్డి, డాక్టర్ మీనా, బి.అనంత, నాగలక్ష్మీ, ప్రసన్న, సి.హెచ్.లక్ష్మీ, దీపిక, అనురాధ, సభ్యులు పాల్గొన్నారు.



వార్షిక సభలో మాట్లాడుతున్న ఛైర్మన్ పావులూరి రమేష్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె, జూలై 28 : ఇసుకపల్లిలోని 11కేవీ లైన్‌లో మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని, వినియోగదారులు సహకరించాలని విద్యుత్‌శాఖ డీఈ టి.శ్రీనివాసరావు తెలిపారు. 11 కేవీ వైర్లకు మరమ్మతులు నిర్వహించటం జరుగుతుందని, పట్టణంలోని గరువురోడ్డు, లక్ష్మీటాకీస్‌సెంటర్ నుంచి బేతపూడి, జేఎల్బీరోడ్డు, బేతపూడి గ్రామానికి విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నదని తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతలకు బహుమతులు అందజేత

కర్లపాలెం, జూలై 28 : మండలంలోని కొత్తనందాయపాలెం పంచాయతీ పరిధిలోని పెట్రోల్ బంకు సమీపంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలలో ఫైనల్ విజేతలకు ఆదివారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, నాయకులు పిట్ల వసంతరెడ్డి, జనసేన నియోజకవర్గ కన్వీనర్ నామన వెంకటశివన్నారాయణ, గొట్టిపాటి శ్రీకృష్ణ, చిలకల సురేంద్రబాబు, మాడా బుచ్చిబాబు, క్రికెట్ యువత పాల్గొన్నారు.



క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పాత గొడవల నేపథ్యంలో దాడి

బాపట్లరూరల్, జూలై 28 : పాతగొడవలు నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాపట్ల రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బాపట్ల మండలం మర్రిపూడి గ్రామానికి చెందిన మున్నం రవీంద్రరెడ్డిపై అదే గ్రామానికి చెందిన కుంచాల మస్తాన్‌రెడ్డి, కుంచాల సాంబిరెడ్డి పాత గొడవలను మనసులో పెట్టుకొని గొడవకు దిగి ఇనుపరాడ్డుతో దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులకు తెలిపారు.

మహిళను వేధింపులకు గురి చేసిన వైసీపీ నాయకుడిపై కేసు

బాపట్ల, జూలై 28 : పట్టణంలోని ఓ ప్రభుత్వ సంస్థలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగినిపై వైసీపీనాయకుడు వేధింపులకు పాల్పడ్డాడంటూ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే పాండురంగాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు నక్కా వీరారెడ్డి పట్టణంలో పనిచేస్తున్న చిరు ఉద్యోగినిని వేధిస్తూ ఇబ్బందులకు గురి చేయటమే కాకుండా చేయి చేసుకున్నాడంటూ ఇటీవల ప్రచారం జరిగింది. ఇరువర్గాల పెద్దలు రాజీప్రయత్నం చేసినప్పటికి మనస్థాపానికి గురైన ఆ యువతీ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో సీఐ యు.శ్రీనివాసులు ఈ మేరకు వీరారెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కర్లపాలెం, జూలై 28 : కర్లపాలెం మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయం దగ్గర జాతీయ రహదారిపై సైకిల్‌ను ద్విచక్ర వాహనం ఢీకొట్టటంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడు పాత నందాయపాలెం గ్రామానికి చెందిన కావూరి లక్ష్మారెడ్డిగా గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పంచాయతీ కుళాయిల నుంచి కలుషిత నీరు సరఫరా

● పాత్రల అడుగుకు చేరుతున్న నల్లని మసి

● చోద్యం చూస్తున్న పంచాయతీ అధికారులు



స్థానిక 16వ వార్డులో సరఫరా అయిన మురుగునీరు

భట్టిప్రోలు, జూలై 28 : ఇవేం నీళ్ళు బాబోయ్.. ఇలాంటి నీళ్ళు ఎలా తాగాలి.. ఈ నీళ్ళు తాగితే రోగాల బారినపడాల్సిందేనంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రక్షిత మంచినీటి ట్యాంకుల ద్వారా సురక్షితమైన నీటిని సరఫరా చేయాల్సి ఉండగా అందుకు భిన్నంగా భట్టిప్రోలు పంచాయతీలో కుళాయిల నుంచి కలుషిత నీరు సరఫరా అవుతుంది. మసితో కూడిన మురుగునీరు సరఫరా అవుతుందని, దుర్గంధం వెదజల్లుతుందని, తాగునీటిని వడబోసి పట్టినప్పటికీ మసి కిందకు చేరుతుందని స్థానిక 16వ వార్డు ప్రజలు తెలిపారు. ఇదేవిధంగా గతంలో కూడా కలుషిత నీరు సరఫరా అయ్యిందని, తరచుగా ఇలాగే కలుషిత నీరు సరఫరా అవుతుందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులకు తెలియజేసినప్పటికి పట్టించుకున్ననాధుడే లేడని వాపోతున్నారు. మసితో కూడిన నీటిని వృధాగా వదిలివేస్తున్నామని, నీటి పన్నును వసూలు చేస్తున్న పంచాయతీ అధికారులు సురక్షితమైన నీటిని సరఫరా చేయడంలో విఫలం చెందారని ఆరోపిస్తున్నారు. కలుషిత నీటిని తాగడం వలన రోగాల బారినపడతామని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టి సురక్షితమైన నీటిని సరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తెలుగుదేశం పార్టీ నాయకుడు నాగేశ్వరరావు మృతి

అమృతలూరు, జూలై 28 : తెలుగుదేశం పార్టీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి ఐమళ్ళ ప్రమోద్ తండ్రి నాగేశ్వరరావు శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. నాగేశ్వరావు మృతదేహాన్ని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగేశ్వరావు పార్టీ కోసం ఎంతో శ్రమించేవారన్నారు. కుమారుడు ప్రమోద్‌కు తన సానుభూతి తెలిపారు. ప్రమోద్‌ను పరామర్శించిన వారిలో వేమూరు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు, యలవర్తి బ్రహ్మానందం, మొవ్వా శ్రీనివాసరావు, కొసరాజు దేవకుమార్, శరణు గిరి, మూల్పూరు ఏసురత్నం, క్రొత్తపల్లి రవీంద్రబాబు, పాంచాళవరం సర్పంచ్ పావులూరి హేమచంద్, పాములపాటి వెంకట సుబ్బారావు, మ్యాధ్యూస్, అమర్తలూరి ప్రభాకరరావు, బాబు, బొల్లు రామేశం, నార్ల శ్రీను, అచ్చన వెంకటేశ్వరరావు, బెనర్జీ తదితరులు ఉన్నారు.



ఐమళ్ళ నాగేశ్వరరావు మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

మోదుకూరులో 270 మందికి ఉచిత కంటి పరీక్షలు

చుండూరు, జూలై 28 : జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని వారి సౌజన్యంతో ఆదివారం మోదుకూరులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో చుండూరు, మామిళ్లపల్లి, అరమండ, దండమూడి, వెల్లలూరు, మంచాల తదితర గ్రామాలకు చెందిన 270 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 107 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించడం జరిగిందని వైద్యులు తెలిపారు. వారికి దాతలు ఉప్పల నాగిరెడ్డి, లంకపోతు రఘునాథరెడ్డి, మిరియాల శ్రీనివాసరావుల చేయూతతో ఉచితంగా ఆగస్టు 5న ఆపరేషన్ చేయించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

శాకాంబరీదేవిగా అమ్మవార్లు



శాకాంబరీ దేవిగా దర్శనమిస్తున్న అద్దేపల్లి గ్రామదేవత ఆడెమ్మతల్లి

భట్టిప్రోలు, జూలై 28 : పవిత్ర ఆషాఢమాసం పురస్కరించుకుని గ్రామదేవతలను పలు కూరగాయలు, పూలు, పండ్లతో శాకాంబరీదేవిగా అలంకరించారు. భట్టిప్రోలు పంచాయతీ అద్దేపల్లి గ్రామదేవత ఆడెమ్మతల్లిని ఆదివారం వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పుష్పాలతో అలంకరించి సహస్రనామావళి, అష్టోత్తర నామావళి గావించి మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని సూరేపల్లి పంచాయతీ వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ పోలేరమ్మ అమ్మవారిని శాకాంబరీదేవిగా అలంకరించి భక్తులు దర్శించుకున్నారు. లలితా సహస్రనామ, దేవి ఖడ్గమాల సహిత లక్ష్మీ అష్టోత్తర శతనామయుక్తంగా కుంకుమ సహిత పుష్పపూజలను జరిపించారు. ఆషాఢ మాసం సందర్భంగా మండలంలోని వెల్లటూరులో ఉన్న శ్రీముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లకు ఆషాడ బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలను సుందరంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా దేవాలయానికి చేర్చి పూజలు జరిపించి అమ్మవారికి బోనాలను సమర్పించారు.

కుంగ్‌ఫూలో సత్తా చాటిన భట్టిప్రోలు విద్యార్థి ప్రభాకర్



కుంగ్‌ఫూలో సిల్వర్ మెడల్ అందుకుంటున్న మాతా కాన్వెంట్ విద్యార్థి ప్రభాకర్

భట్టిప్రోలు, జూలై 28 : హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ టోర్నమెంట్‌లో భట్టిప్రోలు గ్రామానికి చెందిన కౌతరపు ప్రభాకర్ సత్తా చాటాడు. హైదరాబాద్‌లోని జన సంఘం రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన కుంగ్‌ఫూ నేషనల్ టోర్నమెంట్ అండర్-15 విభాగంలో భట్టిప్రోలు మాతా కాన్వెంట్‌కు చెందిన విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ ఆటతీరును కనబరచి సిల్వర్ మెడల్‌ను దక్కించుకున్నాడు. శిక్షణ ఇచ్చిన కుంగ్‌ఫూ టీచర్ కౌతరపు గోపిని, విద్యార్థి ప్రభాకర్‌ను మాతా కాన్వెంట్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

గవర్నమెంట్ ఎంప్లాయిస్ యూనియన్ సర్వసభ్యసమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కె.సూర్యనారాయణ తదితరులు

బాపట్ల,జూలై 28 : గవర్నమెంట్ ఎంప్లాయిస్ యూనియన్ బాపట్ల జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం బాపట్ల మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడు కె.రోశయ్య సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు కె.ఆర్ సూర్యనారాయణకు బాపట్ల జిల్లా తరుపున సంపూర్ణ మద్దతు తెలియజేస్తామన్నారు. దీనికి సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు, సి.హెచ్.బెనర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరోజు శిక్షణకు వెళ్లిన కలెక్టర్

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 28: హైదరాబాద్‌లో సోమవారం ఎన్నికల కమిషన్ ఏర్పాటుచేసిన ఒక రోజు శిక్షణలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొననున్నారు. అందుకోసం ఆమె హైదరాబాద్ వెళ్లారు.

బస్సులు లేక విద్యార్థుల అవస్థలు

బల్లికురవ, జూలై 28 : మండలంలోని పలు మార్గాల్లో ఆర్టీసీ బస్సులు లేక విద్యార్థులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అద్దంకి ఆర్టీసీ డిపో నుంచి బల్లికురవ కొణిదెన చిలకలూరిపేట నైట్ హాల్ట్ బస్సును అధికారులు రద్దు చేయడంతో పలు గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బస్సు సౌకర్యం లేక ప్రజలు పట్టణాలకు వెళితే తిరిగి గమ్యానికి సకాలంలో రాలేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. ప్రమాదాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అలానే మండలంలోని కొత్తూరు గ్రామం నుంచి తమ పిల్లలు పాఠశాలలకు రావాలంటే బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని అగ్రామ ప్రజలు అద్దంకి ఆర్టీసీ డిపో మేనేజర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ అధికారులు వెంటనే గ్రామాలలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా బస్సులను నడపాలని ప్రజలు కోరుతున్నారు.

జోరుగా వ్యవసాయ మోటార్ల దొంగతనాలు


ఉప్పుమాగులూరులో చోరీ అయిన ఎత్తిపోతల పథకం మోటార్లు

బల్లికురవ, జూలై 28 : వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, కేబుల్ వైర్లే లక్ష్యంగా గ్రామాలలో పెద్ద ఎత్తున గుర్తు తెలియని దొంగలు రాత్రుళ్లు చోరీలకు పాల్పడుతున్నారు. వ్యవసాయ సీజన్ కావడం వలన రైతులు మోటార్లు పనిచేయక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దొంగలు గ్రామాలను లక్ష్యంగా చేసుకొని ఒకే రాత్రి పెద్ద ఎత్తున కేబుల్ వైర్లను, ప్యానల్ బోర్డులను తస్కరిస్తున్నారు. పంట పొలాలకు వెళ్లిన రైతులకు మోటార్లు లేకపోవడంతో తీవ్రఆందోళన చెందుతున్నారు. తాజాగా మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో ఉన్న వేణుగోపాల స్వామి ఎత్తిపోతల పథకంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు విలువ చేసే మోటార్లను, బోర్డులను ఎత్తుకెళ్లారు.

ఎత్తిపోతల పథకం పక్కనే ఉన్న అయినాల రామారావు అను రైతుకు చెందిన వ్యవసాయ పొలంలో ఉన్న మోటార్‌ను కూడా దొంగిలించారు. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు వ్యవసాయ మోటార్ లేకపోవడంతో చూసి పక్కనే ఉన్న ఎత్తిపోతల పథకం తలుపుల తాళం పగులగొట్టి ఉండటం చూసి వెంటనే గ్రామంలోని రైతులకు తెలియపరిచి బల్లికురవ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. ఇటీవల పది రోజుల వ్యవధిలోనే మండలంలోని కొత్తూరు, గొర్రెపాడు, కూకట్లపల్లి, గుంటుపల్లి, వల్లాపల్లి, కొత్తపాలెం, కొమ్మినేనివారిపాలెం నక్కబొక్కలపాడు గ్రామాల పరిధిలో వ్యవసాయ మోటార్లు మరియు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల రాగి వైర్లు, సోలార్ ప్యానల్ బోర్డులను రాత్రుళ్లు గుర్తు తెలియని దొంగలు ఏక కాలంలో పలు గ్రామాలలో దొంగిలించారు. పలువురు రైతులు తమ మోటార్ల చోరీపై ఫిర్యాదులు కూడా చేశారు. అయినప్పటికీ పోలీసు శాఖ పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు.

వ్యవసాయ సీజన్‌లో చోరీలు రైతులను భయాందోళన కలిగిస్తున్నాయి. రైతుల మోటార్ల చోరీలపై వెంటనే నిఘా పెట్టి దొంగలను పట్టుకోవాలని పలు గ్రామాలకు చెందిన రైతులు కోరుతున్నారు.

జనసేన పార్టీ సభ్యత్వాల నమోదులో చీరాల ఫస్ట్

చీరాల, జూలై 28 : జనసేన పార్టీ నాల్గవ విడత సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు కొనసాగింది. జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర ప్రోగ్రామ్ కమిటీ కన్వీనర్, చీరాల నియోజకవర్గ సభ్యత్వ నమోదు పరిశీలకుడు ఆల అనిల్ 18వ తేదీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి, వాడరేవు బస్టాండ్‌లో పార్టీ జెండాను ఎగురవేశారు. అక్కడ నుంచి ఆయన దిశానిర్దేశం మేరకు పార్టీ శ్రేణులు సమిష్టి కృషితో నిర్ణీత కాలవ్యవధిలో సభ్యత్వ నమోదులో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆదివారంతో సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగిసింది.

అందిన సమాచారం మేరకు.. చీరాల నియోజకవర్గంలో అత్యధికంగా 4,518 మంది సభ్యత్వాలు స్వీకరించారు. తరువాత రేపల్లె నియోజకవర్గంలో 3,514 మంది, పర్చూరు నియోజకవర్గంలో 3,334, వేమూరు నియోజకవర్గంలో 2,798, బాపట్ల నియోజకవర్గంలో 2,052, అద్దంకి నియోజవకర్గంలో 1,960 మంది సభ్యత్వాలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో చీరాల నియోజకవర్గంలో విస్తృతంగా కృషి చేసిన పార్టీ శ్రేణులకు పరిశీలకుడు ఆల అనిల్ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశంలో ఆయన మాటలే తమకు శిరోధార్యమన్నారు. ఇప్పటి వరకు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సభ్యత్వాల నమోదు ముగిసిందని, అధిష్ఠానం మరికొంత సమయం కేటాయిస్తే ఇంకా అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పార్టీ శ్రేణులు తెలిపాయి.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు

స్వర్ణ(పర్చూరు) : జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా పార్టీ అధినేత ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని ఆపార్టీ జిల్లా కార్యదర్శి శంకరశెట్టి చిరంజీవి అన్నారు. అందులో భాగంగా పర్చూరు నియోజకవర్గ పరిధిలోని కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో ఆదివారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జనసేన పార్టీ సభ్యంతో పొందిన వారికి పార్టీ భీమా సౌకర్యంతోపాటు పార్టీ అండగా నిలుస్తుందన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యకర్తలు ఎన్.రంగారావు, కె.బాలరాజు, ఎన్.వెంకయ్య నాయుడు, టి.గణేష్, నరేష్ పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

సంతమాగులూరు, జూలై 28 : సంతమాగులూరులో శనివారం అర్ధరాత్రి వ్యక్తి అనుమానస్పదంగా మృతి చెందిన సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని వెల్లలచెరువు గ్రామానికి చెందిన దూదేకుల మొగులమ్మకు, పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన స్వర్ణాల శ్రీనివాసరావుకు మధ్య అక్రమ సంబంధంతో ఇరువురు కాపురం చేస్తున్నారు. వారిరువురు ఇటీవల సంతమాగులూరు వచ్చి ఒక ఇంటిలో కాపురం పెట్టారు. మొగులమ్మ సంతమాగులూరులోని బాలాజీ ప్రైవేట్ పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తోంది. స్వర్ణాల శ్రీనివాసరావు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావుకి శనివారం అర్ధరాత్రి గుండె నొప్పితో బాధపడుతూ మృతి చెందారని మొగులమ్మ తెలిపింది. ఈ విషయం తెలిసిన శ్రీనివాసరావు భార్య స్వర్ణాల లక్ష్మీకుమారి ఆదివారం ఉదయం తన భర్త గుండెపోటుతో చనిపోలేదని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయాలని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్‌ఐ సురేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధురాలి మృతి

అద్దంకిటౌన్, జూలై 28: అద్దంకి మున్సిపాలిటీ పరిధిలోని నక్రావారిపాలెంకు చెందిన విప్పర్ల లింగమ్మ అనే వృద్ధురాలు మృతి చెందింది. ఈమె భిక్షాటన చేస్తూ జీవించేది. ఆమె మృతి చెందిన విషయాన్ని ఆదివారం స్థానికులు గుర్తించి పోలీసులకు వారి బంధులకు సమాచారం అందించారు. ఆమె కుటుంబ సభ్యులు వచ్చే వరకు పోలీసులు అక్కడే ఉండగా కుటుంబ సభ్యులు వచ్చిన అనంతరం ఇంటి పరిసరాలను తనిఖీ చేశారు. అక్కడే రెండు వేల రూపాయల నోట్లు, గోతం చిల్లర డబ్బులు ఉన్నట్లు గుర్తించారు. వాటిలో సుమారు లక్ష నుంచి రెండు లక్షల రూపాయలు ఉన్నట్లు బంధువులు గుర్తించారు. మృతదేహాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆ డబ్బులను ఆమె బంధువులు స్వాధీనం చేసుకున్నారు.

7న రౌండ్‌టేబుల్ సమావేశం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 28: మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలని, అలాగే కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలపాలని కోరుతూ ఆగస్టు 7న ఒంగోలులోని బీసీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినందున వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

ఆదాయం కోసం ఆరాటం..!



- ఒంగోలు కార్పొరేషన్‌లో ఆర్‌ఐ పోస్టులకు డిమాండ్
- టీడీపీ నాయకుల ఆశీస్సుల కోసం ప్రయత్నాలు ముమ్మరం
- గత వైసీపీ పాలనలో అడ్డగోలుగా వ్యవహరించిన కొందరు మళ్లీ కొనసాగేందుకు పావులు
- కొత్తవారికి అవకాశం ఇవ్వాలంటున్న ఆశావహులు
- అవినీతికి ఆస్కారం లేకుండా ప్రక్షాళన వైపు ఎమ్మెల్యే దామచర్ల దృష్టి

ఒంగోలు కార్పొరేషన్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) పోస్టులకు భారీ డిమాండ్ ఏర్పడింది. రెవెన్యూ విభాగం ప్రక్షాళన ఖాయమని తేలడంతో ఆదాయం వచ్చే ఆ సీట్ల కోసం పలువురు ఆరాటపడుతున్నారు. గత వైసీపీ పాలనలో ఆపార్టీ పెద్దల ఆశీస్సులతో కొందరు ఆర్‌ఐలు అక్రమార్జనే ధ్యేయంగా అడ్డగోలుగా వ్యవహరించారు. అడిగినంత ఇస్తేనే ఇంటి పన్ను విధించారు. ముఖ్యంగా డిప్యూటీ మేయర్ బంధువులు ఇద్దరు కార్యాలయంలో పెత్తనం చెలాయించారు. మేయర్ అండతో ఒక ఆర్‌ఐ రెచ్చిపోయారు. వీరితోపాటు మరికొందరు కూడా అంతా మా ఇష్టం అన్నట్లు వ్యవహరించారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో వారు తమ సీట్లను కాపాడుకునే పనిలో పడిపోయారు. తాము నిజాయితీపరులమని, వైసీపీతో తమకు ఎలాంటి సంబంధం లేదంటూ టీడీపీ నేతల వద్దకు రాయబారాలు నడుపుతున్నారు. కొత్తవారికి అవకాశం ఇవ్వాలంటూ మరికొందరు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రస్తుత ఆర్‌ఐలు, కొత్తగా వచ్చేందుకు ఆసక్తి చూపుతున్న వారి మధ్య ఇటీవల మాటల యుద్ధం నడిచినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ వ్యవహారం కార్పొరేషన్ కార్యాలయంలో చర్చనీయాంశంగా మారింది.

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 28 : ఒంగోలు కార్పొరేషన్‌లో ఐదు విభాగాలు ఉన్నాయి. వాటి ద్వారా పాదర్శకంగా పౌర సేవలను అందించాల్సి ఉంది. అయితే రెవెన్యూ విభాగంలో అవినీతి రాజ్యమేలుతోంది. ప్రత్యేకించి ఆర్‌ఐ పోస్టులకు ఉన్న డిమాండ్ అటు కమిషనర్ స్థాయి అధికారికి కూడా లేదంటే అతిశయోక్తి కాదు. ఇంటి పన్ను విధించాలన్నా, తగ్గించాలన్నా, ఖాళీ స్థలాలకు పన్నులు వేయాలన్నా ఆర్‌ఐలను ప్రసన్నం చేసుకోవాల్సిందే. అదనపు ఆదాయం దండిగా వచ్చే సీటు కావడంతో ఆ పోస్టులకు భారీ డిమాండ్ ఉంటుంది. గత వైసీపీ హయాంలో ఆపార్టీ పెద్దల ఆశీస్సులతో ఆర్‌ఐలుగా కొందరు హవా సాగించారు. అక్రమార్జనే ధ్యేయంగా ముందుకు సాగి కార్పొరేషన్ ఖజానాకు గండికొట్టారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారింది. ప్రస్తుతం కార్పొరేషన్‌లో కీలకంగా వ్యవహరించే కొందరు అధికారుల మార్పు ఖాయమని తేలిపోయింది. దీంతో తమ పోస్టులను కాపాడుకునేందుకు వారు పావులు కదుపుతున్నారు. 'ఐదేళ్లుగా ఆ పోస్టులకు దూరమయ్యాం. ఇకనైనా కొత్త వారికి అవకాశం కల్పించండి' అంటూ మరికొందరు ఉద్యోగులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదేసమయంలో కొందరు దీపం ఉండగానే ఇల్లు చక్కపెట్టుకుందామనుకున్న రీతిలో భారీగానే చేతివాటం చూపుతుతున్నారు. ఇంకొందరు ఈ రెండు మూడు నెలలైనా నిజాయితీగా ఉంటే తమ సీటుకు ఢోకా ఉండదన్న భావనలో ఉన్నారు. మొత్తంగా కార్పొరేషన్ రెవెన్యూలో నడుస్తున్న వ్యవహారం ఇప్పుడు కార్యాలయంలో చర్చనీయాంశమైంది.

గతంలో వైసీపీతో అంటకాగి.. తాజాగా స్వామి భక్తి

నగరంలో సుమారు 67వేలకు పైగా గృహాలు అధికారికంగా అస్సెస్‌మెంట్‌లు కలిగి ఉన్నాయి. అనధికారికంగా మరో 25వేలకుపైనే ఉన్నట్లు సమాచారం. ఆయా అస్సెస్‌మెంట్‌ల ఆధారంగా నగరంలోని 50 డివిజన్‌లను ఎనిమిది రెవెన్యూ డివిజన్‌లుగా విభజించారు. ఒక్కో డివిజన్ పరిధిలోని నివాసాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఖాళీ స్థలాలు, హోటల్స్, లాడ్జిలు, అపార్ట్‌మెంట్‌లు, విల్లాలకు వారివారి పరిధిలో పన్నులు విధించాల్సి ఉంది. అయితే గత వైసీపీ పెద్దల ఆశీస్సులతో ఆదాయం వచ్చే డివిజన్‌లకు ఆర్‌ఐలుగా ఉన్న వారు ఇప్పుడు వారి సీటును కాపాడుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అందులో ఇద్దరు ఆర్‌ఐలు డిప్యూటీ మేయర్ బంధువులుగా ఐదేళ్లపాటు కార్యాలయంలో పెత్తనం చెలాయించారు. అడిగినంత ముట్టచెప్తేనే పన్ను విధించారు. అది కూడా వేల నుంచి లక్షల రూపాయలు వసూలు చేశారు. అనధికారమైనా, ప్లాను ఉన్నా, లేకున్నా, కోర్టులో ఉన్నా సరే వారు అడిగింది చెల్లించుకోవాల్సిందే. అయితే తాజాగా పాలన మారడంతో తాము నిజాయితీపరులమని, వైసీపీతో తమకు ఎలాంటి సంబంధం లేదంటూ ప్రస్తుత పాలకుల వద్దకు రాయబారాలు నడుపుతున్నారు.

మేయర్ అండతో బిల్డర్ అవతారం ఎత్తిన ఆర్‌ఐ

వైసీపీకి చెందిన మేయర్‌కు అత్యంత సన్నిహితుడుగా ఉన్న మరో ఆర్‌ఐ చేతివాటానికి అడ్డూఅదుపు లేదు. గతంలో ఓ బిల్డింగ్ యజమాని నుంచి భారీగా లంచం డిమాండ్ చేయడంతో సదరు బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఆయన త్రుటిలో తప్పించుకోగా మరో ఆర్‌ఐ దొరికిపోయాడు. ఈ విషయం కార్యాలయం మొత్తం తెలిసినా మేయర్ మనిషికావడంతో ఎవరూ నోరు మెదపలేదు. నగరాని కి చెందిన ఓ బ్యాంకు అధికారి మామిడిపాలెంలోని తన ఇంటికి పన్ను వేయాలని కోరగా ప్లాను ఉన్నప్పటికీ అడిగినంత ఇవ్వలేదన్న అక్కసుతో ప్లాను చించివేసి రెట్టింపు పన్ను విధించారు. ఆదాయం చాలదన్నట్లుగా ఆ ఆర్‌ఐ బిల్డర్‌గా అవతారం ఎత్తాడు. దీన్నిబట్టి ఆర్‌ఐ పోస్టుకు ఉన్న ఆదాయం ఏపాటిదో అర్థమవుతుంది.

ఇదిలా ఉంచితే గతంలో టౌన్‌ప్లానింగ్‌లో విధులు నిర్వర్తిస్తూ ఏసీబీకి చిక్కిన మరో ఉద్యోగికి ఆర్‌ఐగా ఇవ్వడంపై అప్పట్లో చర్చ నడిచింది. ఆయన ఇప్పటికీ కొనసాగుతున్నాడు. అయితే వీరు తిరిగి వారి వారి సీట్లు కాపాడుకునేందుకు భారీగానే ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే వీరినే కొనసాగిస్తే భరించే పరిస్థితి లేదని పలువురు బహిరంగంగానే భయపడిపోతున్నారు.

పాలన మారింది.. పరిస్థితులు మాకే అనుకూలం

గత వైసీపీ హయాంలో ప్రాధాన్యం లేని సీట్లకు పరిమితమైన కొందరు ఉద్యోగుల్లో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో ఆశలు చిగురించాయి. గడిచిన ఐదేళ్లుగా అణచివేతకు గురయ్యామన్న ఆవేదన వారిలో ఉంది. దీంతో ప్రాధాన్యం కలిగిన సీటు దక్కడం ఖాయమన్న నమ్మకాన్ని వారు పెంచుకున్నారు. ఆర్‌ఐలుగా వచ్చేందుకు తమ పరిధిలో తాము ప్రజాప్రతినిధుల వద్దకు సిఫారసులు ప్రారంభించారు. కొందరైతే ఫలానా డివిజన్ తనకు ఖాయమైందని బహిరంగంగానే చెప్పుకొంటున్నారు.

ఈనేపథ్యంలో ప్రస్తుత ఆర్‌ఐలు, కొత్తగా వచ్చేందుకు ఆసక్తి చూపుతున్న వారి మధ్య ఇటీవల మాటల యుద్ధం నడిచినట్లు సమాచారం. 'మమ్మల్ని ఎవరు తొలగిస్తారో చూస్తాం' అంటూ వైసీపీ అండదండలతో ఉన్న ఆర్‌ఐలు చాలెంజ్ చేస్తుండగా, మా ప్రభుత్వంలో మాకు ప్రాధాన్యం ఉంటుందని మరికొందరు ధీమాను వ్యక్తం చేయడం కార్యాలయంలో చర్చనీయాంశమైంది.

సమాచారం సేకరించుకున్న ఎమ్మెల్యే దామచర్ల

కార్పొరేషన్‌లో పౌర సేవలు. పాలనా వ్యవహారాల్లో అవినీతికి ఆస్కారం లేకుండా చూడడంపై ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దృష్టి సారించారు. కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో చోటుచేసుకున్న అవినీతిపై ఆరా తీశారు. గత ఐదేళ్ల నుంచి ఆర్‌ఐలుగా కొనసాగుతున్న వారి జాబితాను ఆయన తీసుకున్నట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వ అండదండలతో వారు వ్యవహరించిన తీరు, అవినీతి గురించి ఆయన సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. ప్రక్షాళన తప్పదన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలన్నదే లక్ష్యంగా ఆయన ముందడుగు వేస్తున్నట్లు తెలిసింది. కొద్దిరోజుల క్రితం కార్పొరేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించిన దామచర్ల.. అవినీతి ఆర్‌ఐలను సున్నితంగా హెచ్చరించినట్లు తెలిసింది. మొత్తంగా ఆదాయ పోస్టుల కోసం ఆర్‌ఐల ఆరాటం చూస్తుంటే పన్నుల రూపంలో ప్రజల నుంచి భారీగానే ముడుపులు వస్తాయన్న విషయం తేటతెల్లమవుతోంది.

పొగాకు రైతులూ తస్మాత్ జాగ్రత్త!

- కర్ణాటకలో పొగాకు పంట ఆశాజనకం
- ఉత్పత్తి 100 మిలియన్ కిలోలు దాటే అవకాశం
- దక్షిణాదిన వచ్చే సీజన్ సాగుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం
- ఇక్కడ అధికంగా సాగుచేయొద్దని బోర్డు అధికారుల సూచన


కర్ణాటకలో ఏపుగా పెరుగుతున్న పొగాకు తోట

ఒంగోలు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులూ తస్మాత్ జాగ్రత్త! కర్ణాటక రాష్ట్రంలో ప్రస్తుత సీజన్ పొగాకు పంట ఆశాజనకంగా కనిపిస్తోంది అక్కడ ప్రస్తుతం పొగాకు సాగు చేసి రెండు మాసాలు గడుస్తోంది. ప్రస్తుతం ఆకు రెలుపునకు రైతులు సిద్ధమవుతున్నారు. గత రెండుళ్లుగా కర్ణాటకలో పొగాకు పంట తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కోగా ప్రస్తుత సీజన్‌లో వాతావరణం అనుకూలించింది. తోటలు ఏపుగా పెరగడంతోపాటు నాణ్యత కూడా బాగా వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే గత రెండేళ్లతో పోల్చితే ఈ ఏడాది అక్కడ పంట దిగుబడి కూడా పెరిగే అవకాశం ఉంది. ఇది వచ్చే సీజన్‌లో ఇక్కడి మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రైతులు బోర్డు అనుమతించిన విస్తీర్ణం, పరిమాణంలోనే పంట సాగు చేయాలని అధికారులు కోరుతున్నారు.

మూడేళ్లుగా అక్కడ తగ్గిన ఉత్పత్తి

కర్ణాటకలో గత మూడు, నాలుగేళ్లుగా వంద మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇస్తుండగా ఎంతో కొంత తక్కువగానే పండుతోంది. అందులో 2022-23 సంవత్సరంలో గణనీయంగా తగ్గింది. ఆ ఏడాది కేవలం 60 మిలియన్ కిలోల దిగుబడి మాత్రమే వచ్చింది. బోర్డు అనుమతించిన పరిమాణంలో 40శాతం ఉత్పత్తి తగ్గింది. 2023-24 లో కూడా వంద మిలియన్ కిలోలకు బోర్డు అనుమతివ్వగా 83 మిలియన్ కిలోలు పండింది. ధర గరిష్ఠంగా కిలో రూ.289 పలకింది. చివరకు సగటు ధర కిలో రూ.254 లభించింది. అలా కర్ణాటకలో పంట ఉత్పత్తి తగ్గడం ఆంధ్రలోని ప్రత్యేకించి దక్షిణాది రైతులకు లాభించింది. కర్ణాటకలో పూర్తయిన వెంటనే రాష్ట్రంలోని దక్షిణాది ప్రాంతంలో వేలం ప్రారంభం అవుతుండటంతో అక్కడ ఉత్పత్తి తగ్గిన ప్రభావంతో ఎగుమతుల అవసరాల మేరకు ఈప్రాంతంలో పంట కొనేవారు పోటీ పడటంతో మంచి ధరలు లభించాయి.

ప్రస్తుతం భిన్న పరిస్థితి

ప్రస్తుత సీజన్ చూస్తే పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది. రాష్ట్రంలోని దక్షిణాది ప్రాంతంలో ఇంకా రైతుల వద్ద మూడో వంతు పంట నిల్వ ఉండగా కర్ణాటకలో ఆకు రెలుపు, క్యూరింగ్ సమయం వచ్చింది. కొన్ని చోట్ల క్యూరింగ్ కూడా చేస్తున్నారు. ఈ ఏడాది కూడా కర్ణాటకలో వంద మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతివ్వగా 100నుంచి 102 మిలియన్ కిలోలు రావచ్చని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే అక్కడ వాతావరణం అనుకూలించడం, ప్రస్తుతం తోటలు ఏపుగా పెరుగుతున్న తీరును పరిశీలిస్తే 110 మిలియన్ కిలోల వరకూ పండవచ్చని వ్యాపార, ఇతరవర్గాల సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. అంటే గత ఏడాది కన్నా దాదాపు 30 మిలియన్ కిలోలు, అంతకుముందు ఏడాది కన్నా 50 మిలియన్ కిలోలు అధికంగా ఉత్పత్తి రావచ్చన్న విషయం స్పష్టమతోంది.

దక్షిణాది ప్రాంతంపై తీవ్ర ప్రభావం

కర్ణాటకలో ఉత్పత్తి పెరిగితే ఆ ప్రభావం రాష్ట్రంలో ప్రత్యేకించి దక్షిణాది ప్రాంతంపై తీవ్రంగానే చూపే అవకాశం ఉంటుంది. ఇక్కడ గత సీజన్ లో పండిన పంట ఇంకా భారీగా కొనుగోలు చేయాల్సి ఉండగా కర్ణాటకలో కూడా అధికంగా పండితే వచ్చే ఏడాది దక్షిణాది మార్కెట్‌ను అది ప్రభావితం చేసి వ్యాపారులు ధరలు తగ్గించే అవకాశం ఉంటుందని మార్కెట్ విశ్లేషకులు చెప్తున్నారు. ఈ పరిస్థితుల్లో దక్షిణాది రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ప్రత్యేకించి వచ్చే సీజన్‌లో పంట సాగు, ఉత్పత్తి విషయంలో ఎంత పరిమితంగా ఉంటే అంత మంచిదన్న అభిప్రాయాన్ని ఆ రంగంలో అనుభవజ్ఞులు తెలియజేస్తున్నారు. అదే సమయంలో అనుమతించిన మేర మాత్రమే పంట సాగు, ఉత్పత్తికి పరిమితం కావాలని బోర్డు అధికారులు సూచిస్తున్నారు.

పాలిటెక్నిక్‌లో పడిపోయిన అడ్మిషన్లు!

- కేవలం 45శాతం సీట్లు మాత్రమే భర్తీ
- ఖాళీగా 1,273 సీట్లు
- ప్రభుత్వ కళాశాలల్లోనే ఎక్కువ ప్రవేశాలు

ఒంగోలు (విద్య), జూలై 28: జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు అంతంతమాత్రంగానే జరిగాయి. పాలిసెట్ తొలి, మలి విడత కౌన్సెలింగ్‌లలో కేవలం 45శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నికల్ కళాశాలల్లో మొత్తం 2,320 సీట్లు ఉండగా పాలిసెట్-24 తుది దశ కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత కేవలం 1,047 మంది మాత్రమే ప్రవేశాలు పొందారు. 1,273 సీట్లు మిగిలిపోయాయి. ప్రభుత్వ కళాశాలల్లోనే అడ్మిషన్లు మెరుగ్గా ఉన్నాయి. అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 120 సీట్లు ఉండగా 94 (78శాతం) భర్తీ అయ్యాయి. కంప్యూటర్ సైన్స్‌లో 32, ఎలక్ట్రానిక్స్‌లో 62 మంది ప్రవేశాలు పొందారు. ఈతముక్కల ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 100 సీట్లు ఉండగా 76మంది చేరారు. కంప్యూటర్ సైన్స్‌లో 32మంది, ఎలక్ట్రానిక్స్‌లో 33మంది, సీపీసీ బ్రాంచిలో 11 మంది అడ్మిషన్లు పొందారు. ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మొత్తం 360 సీట్లు ఉండగా 149 మంది చేరారు. ఈ కళాశాలలో సివిల్, మెకానికల్‌లో 60 సీట్లచొప్పున 120 ఉన్నాయి. ఉదయం, మధ్యాహ్నం షిఫ్ట్‌లలో తరగతులు జరుగుతాయి. అసలు సెకండ్ షిఫ్ట్‌లో విద్యార్థులు చేరలేదు. కేవలం ప్రస్తుతం డిమాండ్ అధికంగా ఉన్న కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్ బ్రాంచిలు ఇక్కడ లేకపోవడం ఈ కళాశాలలో అడ్మిషన్లకు పెద్దఅవరోధంగా మారింది. నాలుగు దశాబ్దాల క్రితం ప్రారంభమై మంచిపేరు ఉన్న ఈ కళాశాలలో వివిధ జిల్లాల విద్యార్థులు చదుతున్నారు. కానీ ఈ ఏడాది ఆయా బ్రాంచిలో ఆశించిన స్థాయిలో చేరలేదు. కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 120 సీట్లు ఉండగా కేవలం 12 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. సివిల్‌లో మూడు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో తొమ్మిది మంది చేరారు. ఆరు ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో 36శాతం, 58శాతం, 38 శాతం, 50.6శాతం,29శాతం, 37శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి.

31న స్పాట్ అడ్మిషన్లు

ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో మిగిలిపోయిన సీట్లను భర్తీచేసేందుకు ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి, ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ పీవీఎల్ఎన్ శివప్రసాద్ తెలిపారు. పాలిసెట్ రాయని వారు 10వ తరగతి కంపార్టుమెంటల్ పాసైన వారికి కూడా చేరవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సత్తా చాటిన నంద్యాల ఎడ్లు

వలేటివారిపాలెం, జూలై 28: నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం మండలం శాఖవరంలో పడమట బజారువారి ఆధ్వర్యంలో అంకమ్మ తిరునాళ్ల సందర్భంగా ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలలో నంద్యాల జిల్లా గుంపసరమునుదిన్నె గ్రామానికి చెందిన కుందురు రాంభూపాల్‌రెడ్డి ఎడ్లజత 3425.04 అడుగులు లాగి ప్రథమ బహుమతి రూ. 60 వేలు సాధించాయి. ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన మేకా కృష్ణమోహన్ ఎడ్లజత 3313.07 అడుగులు లాగి రెండవ బహుమతి రూ. 50 వేలు, నందాల జిల్లా పులి చిన్నఓబులురెడ్డి ఎడ్లజత 3132.07 అడుగులు లాగి మూడవ బహుమతి రూ.40 వేలు, కృష్ణా జిల్లా ఘంటసాలకు చెందిన మేకా కృష్ణమోహన్ ఎడ్లజత 3117.02 అడుగులు లాగి నాల్గవ బహుమతి రూ.30 వేలు, బాపట్ల జిల్లా బల్లికువర గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామి ఎడ్లజత 3084.01 అడుగులు లాగి 5వ బహుమతి రూ.20 వేలు సాధించాయి. అదేవిధంగా గుంటూరు జిల్లా కంచనపల్లి గ్రామానికి చెందిన పి.ఆర్ మెమోరియల్ పులగం త్రిషష్టరెడ్డి ఎడ్లజత 3 వేలు అడుగులు లాగి 6వ బహుమతి రూ. 15 వేలు, కడప జిల్లా ప్రొద్దుటూరు టౌన్ ద్వారక గురివిరెడ్డికి చెందిన ఎడ్లజత 2889.05 అడుగులు లాగి 7వ బహుమతి రూ. 10 వేలు, బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన వీరాస్వామి ఎడ్లజత 2881.09 అడుగులు లాగి 8వ బహుమతి రూ. 5 వేలు సాధించింది. ఈ పోటీలలో విజేతలకు మొదటి బహుమతి వడ్లమూడి మాధవరావు, రెండవ బహుమతి వడ్లమూడి బసవయ్య, 3వ బహుమతి వడ్లమూడి చినహజరత్తయ్య, 4వ బహుమతి ఉండవల్లి శంకరయ్య, 5వ బహుమతి నవ్వులూరి కృష్ణయ్య, 6వ బహుమతి వడ్లమూడి వెంకటరావు, 7వ బహుమతి వడ్లమూడి శ్రీనివాసులు అందజేశారు. కాగా, అంకమ్మ తిరునాళ్లలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వాన కోసం అన్నదాతల నిరీక్షణ..!

- చెదురుమదురుతో పంట దుక్కులను అలముకొన్న గంజేరు మొక్కలు
- భూములకు పదును కాక ఖరీఫ్ సాగు ఆలస్యం



చెన్నుపల్లి పొలంలో మొలిచిన గంజేరు మొక్కలు.. గుంటుపల్లిలో దోస తోటలో అల్లుకున్న గంజేరు.. దున్ని ఎదురు చూస్తున్న రైతులు

బల్లికురవ, జూలై 28 : చెదురు మదురు వర్షాలు పడడంతో పంట దుక్కులు బీడులుగా మారుతున్నాయి. వర్షపాతం సరిగ్గా లేకపోవడంతో పంటల సాగు ఈ ఏడాది ఆలస్యం అవుతుందని రైతులు అంటున్నారు. కొన్ని గ్రామాలలో పంటలు వేసేందుకు దుక్కులు దున్ని సిద్ధం చేస్తున్న రైతులను గంజేరు మొక్కలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మెదలే పంటలు సాగు చేసేందుకు సరిపడా వర్షం లేక పలుమార్లు పొలాలను దున్ని పెడుతుంటే గంజేరు మొక్కమాత్రం ఎలాంటి మందులు వాడకుండానే పంట సాగు చేసిన విధంగా దట్టంగా వస్తుందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మూడు సార్లు విత్తనాలు నాటేందుకు దుక్కి బగు చేశానని చెదురుమదురుగా పడిన వర్షాల వలన గడ్డి, గంజేరు మొక్కలు పెద్ద ఎత్తున వచ్చాయని ఈ ఏడాది పంట సాగు చేసే వరకు పెట్టుబడి కూడా పెద్ద మెత్తంలో అయ్యే అవకాశం ఉందని రైతులు తెలిపారు.

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు మాసాలు గడుస్తున్నా పంటలు సాగు మాత్రం అరకొరగానే ఉంది. ఏ గ్రామంలో చూసిన పంటలు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నా సకాలంలో మంచి వర్షం పడలేదు. దీంతో పంట దుక్కులు గడ్డి, గంజేరు మొక్క వచ్చి బీడులుగా మారాయి. బల్లికురవ మండలంలోని గుంటుపల్లి, చెన్నుపల్లి, ముక్తేశ్వరం, ఎస్ఎల్ గుడిపాడు, రామాంజనేయపురం, అంబడిపూడి, వల్లాపల్లి, కొండాయపాలెం, మల్లాయపాలెం, నక్కబొక్కలపాడు గ్రామాలలో ఖరీఫ్ పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. గత ఏడాది ఆదే నెలలో వర్షం ఒకే సారి పడడంతో రైతులు పంటల సాగు చేపట్టారు. ఈ ఏడాది మాత్రం వర్షపాతం దఫాలు దఫాలుగా పడడంతో పంట భూములు బాగు చేసుకునేలోపే మరలా గడ్డి పెరగడంతో రైతులు పంటలను సాగు చేయలేకపోయారు. అత్యధిక శాతం మంది రైతులు పంటల సాగు చేసేందుకు వర్షం కోసం ఎదురు చూపులు చుస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో పంటలు సాగు చేస్తే ముందు మందు కూడా తుఫాన్ల తాకిడి నుంచి పంటలను కాపాడుకునే వీలు ఉంటుందని కానీ ఇప్పుడు సరైన వర్షం మాత్రం పడలేదని రైతులు వాపోతున్నారు. పలు గ్రామాలలో రైతులు పంట దుక్కలను దున్ని పెట్టి వర్షం కోసం వేచి ఉన్నారు. సరైన వర్షం పడకుంటే పంటలు సాగు చేయడం కష్టం అని రైతులు తెలిపారు.

మొక్క దట్టంగా వస్తుంది



సాగుకు గంజేరు మొక్క బాగా ఇబ్బందిగా మారింది. దోస తోట సాగు చేస్తే దోస మొక్కల కంటే గంజేరు మొక్క అధికంగా వచ్చింది. దీంతో పంట దిగుబడులు లేవు. దుక్కులను దున్నిన నాలుగు రోజులకే మళ్లీ గంజేరు మొక్క పుడుతోంది. ఏటా వ్యవసాయ సీజన్‌లో ఈ పిచ్చి మొక్క వలన రైతులు బాగా ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురిసిన వెంటనే పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

\- వీరవెంకయ్య, రైతు, ముక్తేశ్వరం

దడ పుట్టిస్తున్న మొక్కలు

పలు గ్రామాలలో రైతులు పంట దుక్కులను ఎన్ని మార్లు దున్ని బాగు చేసినా మరలా వెంటనే గంజేరు మొక్కలు దట్టంగా రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలకువేలు పెట్టుబడి పెట్టి పంట పొలాలలను యంత్రాలతో దున్నించిన ఎలాంటి ప్రయోజనం లేదని గంజేరు మొక్క పంటను కూడా నాశనం చేస్తుందని రైతులు తెలిపారు. గుంటుపల్లి, ముక్తేశ్వరం గ్రామాలలో రైతులు చెదురు మదురు వర్షాలకు సాగు చేసిన దోస పంటలో గంజేరు మొక్క పెరిగి దోసకాయలు కూడా కాయడం లేదని రైతులు తెలిపారు. గంజేరు మొక్కకు చావు లేదని పలువురు రైతులు తెలిపారు. మాగాణి భూములలో తడి తగిలితే వెంటనే బయటకు వస్తుందని సైంటిస్టులు పరిశీలించి గంజేరు మొక్క నియంత్రణకు చర్యలు చేపట్టాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

రోడ్డు పనులు ప్రారంభం

ఇంకొల్లు, జూలై 28 : మండలంలోని సూదివారిపాలెం నుంచి నాగండ్లకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డును అభివృద్ధి చేసేందుకు ఆదివారం పనులు ప్రారంభించారు. వైసీపీ పాలనలో ఈ ఈ రహదారి అధ్వానంగా మారి, ప్రయాణం నరకయాతనగా మారింది. ఈ నేపథ్యంలో సూదివారిపాలెం గ్రామస్థులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. రోడ్డును బాగు చేయాలని విన్నవించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఏలూరి అధికారులకు సూచించారు. సుమారు రూ.41లక్షలతో 3.5 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు ఆదివారం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సూదివారిపాలెం గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరునాళ్లకు ముస్తాబైన ఆలయం



అమ్మవారి ఆలయానికి వేస్తున్న రంగులు

వేటపాలెం(చీరాల), జూలై 28 : మండల పరిధిలోని పందిళ్లపల్లి పందిళ్లమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవ కార్యక్రమాలు ఈ నెల 31వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి మూడు రోజులు గ్రామ దేవతలకు సద్ది నైవేద్యాల చెల్లింపులు జరుగుతాయి. 3వ తేదీన శిడిమహోత్సవం జరుగుతుంది. 4వ తేదీన పొంగళ్లతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలపారు. అందుకు సంబంధించి ఆలయానికి రంగులు వేస్తున్నారు. ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.



రాఘవరావు దంపతులను సత్కరిస్తున్న సాహితీ సభ్యులు

సాహిత్యంపై పట్టున్న వ్యక్తి రాఘవరావు

అద్దంకిటౌన్, జూలై 28 : రాఘవరావు మంచి కథా రచయిత అని, ప్రత్యేకించి చలం, శ్రీశ్రీ, యండమూరి రచనలు, సినిమా సాహిత్యంపై మంచి పట్టు ఉన్న వ్యక్తి రాచపూడి వెంకట రాఘవరావు అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం సాహితీ మిత్ర మండలి అద్దంకి ఆధ్వర్యంలో స్థానిక మారం వారి సేవాసదన్‌లో లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షతన ఆత్మీయ పురస్కార సభ జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 40 సంవత్సరాలు పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో చక్కని సేవలందించాలరని, సభ నిర్వహణలో కచ్చితంగా సమయపాలన పాటించే విధంగా అందర్నీ అలవాటు చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాఘవరావు రచనలు, కవితలు గురించి అన్నమనేని వెంకట్రావు, డీవీఎం సత్యనారాయణ, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, డాక్టర్ యూ దేవపాలన, వారణాసి రఘురామశర్మ వి శ్లేశించారు. అనంతరం రాఘవరావు దంపతులను సాహితీ మిత్ర మండలి, రోటరీ క్లబ్, జానపద కళాపీఠం, ఇతర సాహితీ సంస్థల సభ్యులు ఘనంగా సన్మానించి పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, మురళి సుధాకరరావు, వెంకటేశ్వరరావు, విశ్వమోహన్, పోలిరెడ్డి, సుబ్బారావు, కామేశ్వరశర్మ పాల్గొన్నారు.

వామ్మో రోడ్డు మార్జిన్‌లు

ఇబ్బందిపడుతున్న వాహనచోదకులు



చందలూరు, కొణికి మధ్య రోడ్డు మార్జిన్‌లో ఏర్పడిన గుంతలు

పంగులూరు, జూలై 28 : మండలంలోని అలవలపాడు, కొణికి ఆర్ అండ్ బీ రోడ్డుకు ఇరువైపులా రోడ్డు మార్జిన్లు గోతులమయంగా మారాయి. వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఆర్ అండ్ బీ ప్రధాన రహదారికి మార్జిన్లలో ఏర్పడిన గోతుల వలన వాహన చోదకులు రాక పోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ ప్రధాన రహదారిలో ఆర్టీసీ బస్సులతో పాటు ఇటుక, కంకర, గ్రావెల్‌తో పాటు ఇతర సరుకులు చేరవేసే లారీలు, పొలాలలో వ్యవసాయ పనులకోసం తిరిగే ట్రాక్టర్ల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. వీటితో పాటు ఇంకొల్లు నుంచి జాతీయ రహదారి వైపుగా పలు పనుల నిమిత్తం ఒంగోలు, అద్దంకి వెళ్లే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సింగిల్ బీటీ రోడ్డుకు రెండు వైపులా మార్జిన్లలో ఏర్పడిన గోతుల కారణంగా రాత్రి వేళ ఎదురెదురుగా వచ్చే వాహనాల వెళుతురులో మార్జిన్లలో గోతులు గుర్తించలేక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొద్ది రోజుల కిందట మండలంలోని తక్కెళ్లపాడు సమీపంలో రాత్రి వేళ ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు తిరగబడింది. 16వ నెంబరు జాతీయ రహదారి నుంచి కొణికి వరకు మార్జిన్లలో ఏర్పడిన గోతులు పూడ్చి ఈ రహదారిలో నడిచే వాహనాలు ప్రమాదాల బారిన పడకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

తీరప్రాంత అభివృద్ధి.. పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే కొండయ్య



తీరంలో పర్యాటకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), జూలై 28 : టూరిజం పరంగా తీరప్రాంత అభివృద్ధి, పర్యాటకుల భద్రత, మెరుగైన సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం ఆయన పలువురు నాయకులు, కార్యకర్తలతో కలసి చీరాల మండల వాడరేవు నుంచి వేటపాలెం మండలం పొట్టిసుబ్బయ్యపాలెం వరకు తీరం వెంట పర్యాటకుల భద్రత కోసం చేపట్టిన చర్యలను పరిశీలించారు. తీరంలో నాటిన హెచ్చరిక జెండాలు, వాచ్‌టవర్స్, గత ఈతగాళ్లు, కోస్టల్ బైక్ తదితరాలను పరిశీలించారు. ఆ సందర్భంగా పర్యాటకులతో మాట్లాడారు. గజ ఈతగాళ్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అండగా ఉంటా

మండల పరిధిలోని పందిళ్లపల్లి తోకపేటలో ఆదివారం మాచర్ల శ్రీమన్నారాయణ(శివయ్య) తన నివాసంలో ఎమ్మెల్యే కొండయ్యకు ఆత్మీయసమావేశం, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ అందరికీ అండగా, అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. అనంతరం కొండయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సజ్జా చంద్రమౌళికి నివాళి

సజ్జా చంద్రమౌళి వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య ఆదివారం చీరాల గడియార స్తంభం సెంటర్లోని ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావి తరాల వారి ఆలోచనలకు అనుగుణంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండడం హర్షణీయం

చీరాల పాపరాజుతోటలోని బాపనమ్మ కల్యాణ మండపంలో ఆదివారం వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ద్వితీయ కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో క్లబ్ ప్రతినిధులు ముందుండటం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

పరోపకార గుణం కలిగి ఉండాలి



వెంకట శ్రీనివాసరావును సన్మానిస్తున్న సభ్యులు

వేటపాలెం(చీరాల), జూలై 28 : మానవ జీవితంలో ప్రతి ఒక్కరూ పరోపకార గుణం కలిగి ఉండాలని ప్రముఖ ప్రవచన కారులు పొన్నూరు వెంకట శ్రీనివాసరావు చెప్పారు. ప్రొబస్ క్లబ్ ప్రతినిధులు ఆధ్వర్యంలో ఆదివారం ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఆవుల పున్నయ్య, గొల్లపూడి శీతారాం, వడలి రాధాకృష్ణ, బీరక సుబ్రమణ్యం, బి.సుబ్బరామయ్య, కోటేశ్వరరావు, శివప్రసాద్, నాగమనోహర్‌లోహయా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

ఇంకొల్లు, జూలై 28 : మండలంలోని వంకాయలపాడు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఈదర శ్రీనివాసరావు శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై పలువురు ఉపాధ్యాయులు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉత్సాహంగా అంకితభావంతో పనిచేసిన శ్రీనివాసరెడ్డి అందరితో కలిసిమెలసి ఉంటేవారని, ప్రమాదసమయంలో ఎవరూ చూడకపోడంతో తీవ్ర రక్తస్రావమై ప్రాణాలు విడిచారన్నారు. శ్రీనివాసరెడ్డి ఇంకొల్లు మండలం కొణికి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నారు.



సారె తీసుకొని ఊరేగింపుగా వెళ్తున్న మహిళా భక్తులు

వైభవంగా అంకమ్మకు ఆషాడ సారె

భక్తిశ్రద్ధలతో సమర్పించిన భక్తులు

చినగంజాం, జూలై 28 : మండలంలోని మున్నంవారిపాలెం గ్రామంలోని గ్రామ దేవత అంకమ్మ తల్లికి ఆషాడ సారె సమర్పించే కార్యక్రమాన్ని మహిళా భక్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని గ్రామ దేవత అయిన అంకమ్మ తల్లికి సారె అందజేశారు. గ్రామంలోని మహిళా భక్తులు పొంగళ్లు, చీర, జాకెట్లు, చలిమిడి, పండ్లు, పసుపు కుంకుమను నెత్తి మీద బెట్టుకొని పురవీధుల గుండా మేళతాళాలు, కనకతప్పెట్లు నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి సారె తీసుకొని వెళ్లారు. ఆలయ పూజారి అంకమ్మతల్లిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు తదనంతరం మహిళా భక్తులు అంకమ్మ తల్లికి సారెలను సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. తదనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. గ్రామ పెద్దలు, యువత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కళకళ లాడుతున్న పర్చూరు మంచినీటి చెరువు

చెరువులకు జలకళ

- మంచినీటి చెరువులకు చేరుతున్న సాగర్
- ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

పర్చూరు, జూలై 28 : నిన్న మొన్నటి వరకూ అడుగంటిన చెరువులు, కలుషిత నీటితో ప్రజలు నీటి కోసం నానా అవస్థలు పడ్డారు. ఎక్కడ చూసినా అడుగంటిన చెరువులే దర్శనమిచ్చాయి. గుక్కెడు నీటి కోసం ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఈతరుణంలో ప్రభుత్వం తాగునీటి అవసరాల కోసం సాగర్ జలాలను విడుదల చేసింది. దీంతో సాగర్ జలాలతో చెరువులను నింపేవిధంగా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం చెరువులు సాగర్ జలాలతో కళకళ లాడుతున్నాయి. మండలంలోని నెలకొన్న నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని యుద్ధ ప్రాతిపదికన చెరువులను నింపే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలు జారీచేశారు. దీంతో అధికారులు ఆమేరకు చర్యలు చేపట్టి మంచినీటి చెవులను నింపే కార్యక్రంలో తలమునకలయ్యారు. ఆయా గ్రామాల్లో మంచినీటి చెరువులు సాగర్ నీటితో కళకళ లాడుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న తన్నీరు

అద్దంకిటౌన్, జూలై 28: ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హమీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు శింగరకొండ అన్నారు. ఆదివారం అద్దంకిలోని పార్టీ కార్యాలయంలో అద్దంకి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం సీనియర్ నాయకుడు వల్లెపు నరసింహా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు పెట్టాలని, భవనాసి రిజర్వాయర్‌ను పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో సీనియర్ నాయకుడు కేఎల్‌డీ ప్రసాద్, ఖదర్ బాషా, మేకల రమణయ్య, ఆంజనేయులు, ముస్తపా పాల్గొన్నారు.

మా వాటా నిధులు ఇవ్వండి

- మూడేళ్ల నుంచి ఒక్కపైసా ఇవ్వలేదు
- సమావేశంలో ఎంపీటీసీలు ధ్వజం
- హాజరుకాని రెవెన్యూ, విద్యుత్ అధికారులపై ఆగ్రహం



సమస్యలపై నిలదీస్తున్న బొబ్బేపల్లి ఎంపీటీసీ సభ్యుడు హరిబాబు

మార్టూరు, జూలై 28 : మూడేళ్ల నుంచి అడుగుతున్నా ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. మా గ్రామాలలో ఒక్క పనినీ చేయలేకపోయాం. మండల పరిషత్ నిధులు మీ ఇష్టం వచ్చిన పనులకు వినియోగిస్తారా.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ఓట్లు అడగడానికి వెళితే.. జనం అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోయామని బొబ్బేపల్లి, వలపర్ల ఎంపీటీసీ సభ్యులు దండా హరిబాబు, జంజనం పద్మ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఎంపీపీ భుక్యా శాంతిబాయి అధ్యక్షత వహించారు. గత మూడేళ్లలో మండల పరిషత్ నిధులతో బొబ్బేపల్లి గ్రామంలో చిన్నపని కూడా చేయలేకపోయామని,మండలపరిషత్ నిధులతో వారికి ఇష్టమైనపనులు చేసుకున్నారని ఎంపీటీసీ సభ్యుడు హరిబాబు సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఏళ్ల తరబడి శిథిలమైన విద్యుత్ స్తంభాలున్నాయని, వాటిని తొలగించాలని గత మూడు సమావేశాలలో మొరపెట్టుకున్నా ఇంతవరకు సమస్య పరిష్కరించలేదన్నారు. అదేవిధంగా వలపర్లలోని గరటయ్య కాలనీలో సైడు కాల్వలు తీయాలని, సీసీ రోడ్డు వేయాలని ఎన్ని సార్లు మీటింగ్‌లో చెప్పినా ఇంతవరకు పట్టించుకోలేదని ఎంపీటీసీ సభ్యులు పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. బొబ్బేపల్లి, ద్రోణాదుల, రాజుగారిపాలెం తదితర గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు విద్యుత్ సమస్యలను ప్రస్తావించారు. సమావేశానికి విద్యుత్ అధికారులు రాకపోవడం పట్ల వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు కూడా సమావేశానికి హాజరుకాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో ఎంపీడీవో నితిన్ మాట్లాడుతూ సమావేశానికి హాజరుకాని శాఖలకు చెందిన అధికారులపై కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామన్నారు. మండల వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులను 50 శాతం, కందులను 30 శాతం రాయితీతో అందజేస్తామన్నారు. ఉద్యాన అధికారి బీ హనుమంతనాయక్ మాట్లాడుతూ కూరగాయలు, పూలతోటలను పెంచే రైతులకు సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. మినీ ట్రాక్టర్లు కావలసిన రైతులు ఉద్యాన శాఖను సంప్రదించాలన్నారు. అనంతరం హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ మండలంలో వివిధ దశలలో 718 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని వాటిని వెంటనే పూర్తయ్యేవిధంగా ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన వారు ప్రభుత్వ పథకాలకు సంబంధించి, ప్రజలకు ఉపయోగకరంగా ఉండేందుకు అవసరమైన వివరాలను గ్రామ సచివాలయాలకు పంపించాలని సభ్యులు అధికారులను కోరారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ చుండి సుజ్ఞానమ్మ, వెలుగు ఏపీఎం రాజారత్నం, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అద్దంకమ్మ సారె మహోత్సవం



ప్రత్యేక పూజలు అందుకుంటున్న అమ్మవారు

దేవాంగపురి(చీరాలటౌన్), జూలై 28 : చీరాల మండలం దేవాంగపురి పంచాయతీ పాత చీరాలలోని గ్రామ దేవత శ్రీ అద్దంకమ్మ అమ్మవారి సారె మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 108 మంది దేవు వంశస్త మహిళలు సారెతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. దీంతో వేకువజాము నుంచే భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఏటా ఆషాడ మాసంలో కోరిన కోర్కెలు తీర్చే పోలేరమ్మను ఘనంగా కొలుస్తామని తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చీరాల భక్తుడికి అలిపిరిలో పాముకాటు

చీరాలటౌన్, జూలై 28 : చీరాల భక్తుడు నాగేంద్ర తిరుమల అలిపిరి మెట్ల మార్గంలో పాము కాటుకు గురయ్యారు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. సుమారు 8 మంది మిత్రులతో కలిసి నాగేంద్ర కాలినడకన వెళుతుండగా అలిపిరి 7వ మైలురాయి వద్ద పాము కాటేసింది. దీంతో సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు, టీటీడీ ప్రతినిధులు 108లో తిరుమల అశ్విని హస్పిటల్‌కు తరలించి చికిత్సను అందిస్తున్నారు. ప్రస్తుతం నాగేంద్ర పరిస్థితి నిలకడగా ఉందని మిత్రులు సమాచారం ఇచ్చారు.